
# జీవిత పరమార్థం

బ్రహ్మవిద్వరిష్ట తటవర్తి రాజ్యలక్ష్మి



# జీవిత పరమార్థం?



రచన : బ్రహ్మవిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి

మొదటి ముద్రణ : ఆగస్ట్, 2025
ప్రతులు : 2,000

వెల : రూ.70/-

పుస్తకముల కొరకు :-
**తటవర్తి వీరరాఘవరావు,**
తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.
సెల్ : 94901 71853, 9440309812

# విషయ సూచిక :


1. జీవిత పరమార్థం ? .......................................................... 3

2. ఉత్తమోత్తముడిగా ఎదగాలి అంటే? .......................................... 12

3. ప్రాపంచిక ధనం - ఆధ్యాత్మిక ధనం ........................................ 21

4. ఏ జంతువుకి లేని మనసు మానవునికే ఎందుకు ఇవ్వబడింది? ......... 35

5. బహిర్ సాధన - అంతర్ సాధన ................................................ 43



## ధ్యానం చేసే పద్ధతి
## శ్వాస మీద ధ్యాస



ఎవరికి తగిన సుఖాసనంలో వారు హాయిగా కూర్చుని... చేతులు రెండూ కలిపి... కళ్ళు రెండూ మూసుకుని... ప్రకృతి సహజంగా జరుగుతోన్న ఉచ్ఛ్వాస, నిశ్వాసలను గమనిస్తూ వుండాలి!

మధ్యమధ్యలో అనేకానేక ఆలోచనలు వస్తున్నా వాటిని ఎప్పటికప్పుడు 'కట్' చేస్తూ... మళ్ళీ, మళ్ళీ శ్వాస మీదకే... ధ్యాస మరల్చుతూ వుంటే.. క్రమక్రమంగా... ఆలోచనా రహిత స్థితి కలుగుతుంది.... చిత్తవృత్తులు నిరోధించబడతాయి... మనస్సు నిర్విషయం, శూన్యం అయిపోతుంది. మనస్సు శాంతిస్తుంది. ఇదే ధ్యాన స్థితి.

ఈ ఆలోచనా రహిత స్థితిలో కలిగే అనేకానేక శారీరక, నాడీ మండల, ఆత్మానుభవాలను గమనిస్తూ వుండాలి. ఆ స్థితిలో విశ్వమయ ప్రాణశక్తి. అపారంగా శరీరంలోకి ప్రవేశించి నాడీమండలాన్ని శుద్ధి చేస్తుంది. ఆ శక్తి వల్ల రోగాలన్నీ తగ్గుతాయి. నాడీమండలశుద్ధి వల్ల కర్మలు పోతాయి.

ప్రతిరోజూ ఎవరి వయస్సు ఎంతుంటుందో... కనీసం అన్ని నిమిషాలు... తప్పనిసరిగా... రోజుకి రెండు సార్లుగా... ధ్యానం చెయ్యాలి.

# జీవిత పరమార్థం ?

ఎవరైనా ఆధ్యాత్మికతలోకి వచ్చాకే మానవ జీవితం యొక్క పరమార్ధం తెలుసుకుని జీవిస్తారు. ఎందుకు అంటే ప్రాపంచిక జీవితంలో మానవ జన్మ యొక్క పరమార్ధం తెలియదు. అలాగే మానవుడికి ఏ జీవికి ఇవ్వనన్ని ఈ సృష్టి ఇచ్చింది.

మానవుడు సృష్టిలో ఇన్ని రకాలు అనుభవిస్తున్నా ఎందుకు ఆనందాన్ని పూర్ణంగా పొందలేకపోతున్నాడు అనే ఆలోచన మానవుల్లో కలుగుతూ ఉంటుంది. కొంతమంది డబ్బు, భోగాలు, సుఖాలు ఉంటే ఆనందం వస్తుంది అని అనుకుంటారు. మరి అవన్నీ కూడా తాత్కాలికంగా వుంటాయి కానీ శాశ్వతమైన ఆనందాన్ని ఇవ్వవు అని ప్రాపంచిక జీవితంలో అర్థమవుతుంది. మరి దీనికి కారణం ఆలోచించే సమయం, జ్ఞానం ప్రాపంచిక జీవితంలో వుండదు.

కానీ ఎప్పుడైతే ఆధ్యాత్మికంలోకి వస్తారో కారణాలు అర్థమవుతాయి. ఆధ్యాత్మికంలోకి వచ్చాకే మానవ జీవితం యొక్క పరమార్థం ఏమిటి అన్నది అర్థమవుతుంది. మానవుడు ఖానా, పీనా, సోనా అంటే తినడం, త్రాగడం, పడుకోవడం... ఈ మూడు చేస్తే పశువుతో సమానం. కాని భగవంతుని కోసం ప్రయత్నం చేస్తే ఈ పశువు లాంటి మానవుడే పశుపతిగా మారతాడు.

పూర్ణమైన ఆనందం పొందడమే ఈ జీవితం యొక్క పరమార్థం. మరి ఈ పూర్ణమైన ఆనందాన్ని భగవంతుడి సృష్టిలో వెతికితే దొరకదు, ఆ ఆనందం భగవంతుని దగ్గరికి వెళితేనే దొరుకుతుంది. జీవితంలో ఎందుకు ఈ దుఃఖం కలుగుతుంది? ఎందుకు ఆనందాన్ని కోల్పోయారు? అంటే పురుషోత్తముడైన భగవంతుని సాంగత్యాన్ని వదులుకొని భూమి మీదకి వచ్చినప్పుడే ఆనందాన్ని కోల్పోయారు.

పురుషోత్తముడు అనే పదం ఋషులు ఎందుకు వాడారంటే! సృష్టిలో

అందరికంటే గొప్పవాడు ఎవరయ్యా అంటే ఆ భగవంతుడే అని చెప్తారు. మరి ఆ పురుషోత్తముడైన భగవంతుడి నుంచి విడువడి భూమిమీదకు వచ్చావు కాబట్టే ఆనందానికి దూరమై, దుఃఖం అనే సముద్రంలో పడి నీ జీవితమంతా అల్లకల్లోలంగా వుందని అనుకుంటావు.

మళ్లీ ఆ భగవంతుని యొక్క సాంగత్యంలోకి చేరినప్పుడే పూర్ణమైన ఆనందం పొందుతావు అని పరిష్కారం కూడా చెప్పారు గురువులు. మరి ఆ పరమాత్మ యొక్క సాంగత్యాన్ని ఎలా పొందగలరు అంటే? అది కూడా ఒక అదృష్టమే. పుణ్యం చేస్తే పొందుతారని కొంతమంది భక్తి యోగంలో ఉంటారు, కర్మలు చేస్తే పొందుతారని కొంతమంది కర్మయోగంలో ఉంటారు. ఆ రెండు చేస్తే చాలు భగవంతుడి యొక్క సాంగత్యంలోకి వెళ్ళిపోవచ్చు అనుకుంటారు.

కానీ ఇవన్నీ పుణ్యకర్మలే కానీ భగవంతుడు సాంగత్యం పొందే, మార్గాలు కావు. మీ తపన, జిజ్ఞాస, ఆర్తి, ఇవన్నీ భగవంతుడికి తెలుస్తూనే ఉంటాయి. అంటే చూడండి మీ పుట్టుకతోనే ధ్యాన మార్గంలోకి ఎప్పుడూ రారు. కొన్నాళ్ళు భగవంతుడి నామస్మరణ చేస్తూ, జపం చేస్తూ, లేకపోతే ఎన్నో రకాల ఆరాధనలు చేస్తూ, లేదా ఎన్నో రకాల దానధర్మాలు చేస్తూ, తపిస్తే ఆ తపనే తపస్సుగా మారి మీ జీవితంలోకి గురువు వస్తాడు.

మానవుడికి ఈ దుఃఖాలు, కష్టాలు ఎక్కువయ్యే కొద్దీ వీటికి అంతం ఎప్పుడు అన్నది అర్థం కాదు. ఇది ఒక మహాసముద్రంలా ఉంది, ఆ దుఃఖ సముద్రాన్ని దాటేది ఎలా? అని ప్రతి మనిషి మనసులో ఆవేదన పడుతూనే వుంటాడు, కానీ పైకి చాలా బాగున్నట్టు నటిస్తాడు.

అంటే ఇప్పుడు ఒక చిన్న కోరిక వచ్చింది, అది తీరిన వెంటనే ఇంకొక కోరిక, మరల ఇంకొక కోరిక పుడుతుంది. అంటే సముద్రంలో నీళ్లు ఎలా తరగవో మానవుడి యొక్క కోరికలకు అంతమే వుండదు, అలా చచ్చేవరకు కోరుకుంటూనే వుంటాడు, అందుకే కోరికలు సముద్రంతో పోల్చారు.

కానీ మరి ఎంత పెద్ద సముద్రమైనా ఒక చిన్న నావ ఉంటే దాటొచ్చు.

ఋషులు ఏం చెప్పారంటే ఒక చిన్న నావ ఉంటే సముద్రాన్ని ఎలా దాటగలమో, అజ్ఞానమనే సముద్రాన్ని దాటడానికి జ్ఞానం అనే నావ ఉండాలి అని చెప్పారు. అంతటితో ఊరుకోలేదు మనకి వచ్చే ప్రతి అనుమానానికి సమాధానం వారు చెప్పారు.

మరి నావ ఉంటే సరిపోతుందా? నావను నడిపే నావికుడు ఉండాలి కదా? మరి ఆ నావని ఎవరు నడుపుతారు? నిన్ను అందులో కూర్చోబెట్టి ఒడ్డుకి ఎవరు తీసుకెళ్తారు? అంటే ఆ నావని నడిపే నావికుడే నీ జీవితంలోకి వచ్చిన సద్గురువు. ఆ గురువు వచ్చేవరకు నీ జ్ఞానమనే నౌక ముందుకి కదలదు. జ్ఞానమూ ఉంది, నీ దుఃఖమనే సముద్రం ఉంది. కానీ ఆ జ్ఞానాన్ని నీకు అందించడానికి సద్గురువు రావాలి.

అలా జీవితంలో నిన్ను జ్ఞానమనే నావని ఎక్కించి నడిపించడానికి సద్గురువులు వస్తారు. మరి సముద్రాన్ని దాటడానికి నావ, నావికుడు ఉన్నా ఇంకొకటి కావాలి. నువ్వు సముద్రంలో నావపై వెళ్తున్నప్పుడు సముద్రం ప్రశాంతంగా ఉండదు, ఒక్కొక్కసారి తుఫానులు వచ్చి సముద్రం అల్లకల్లోలంగా ఉంటుంది. నీ జీవితంలో ఈ అల్లకల్లోలం అనే వాతావరణం ఉండకుండా ఉండడానికి దైవ కృప అనేది కూడా నీకు ఉండాలి. ఆ దైవ కృప వల్ల తుఫాను లేని సముద్రంలో నావ ప్రయాణం సాఫీగా సాగినట్టు. నీ జీవితంలో అల్లకల్లోలం అనే పరిస్థితులు లేకుండా చేసే శక్తి ఒక్క భగవంతుడికి మాత్రమే ఉంది. మరి ఆ భగవంతుడి కృప ఉంటేనే నీవు జ్ఞానం నేర్చుకుంటున్నప్పుడు ఏ విధమైన అడ్డంకులు, ఆటంకాలు రావు.

చాలామందికి ఉదయం మనం నిర్వహించే జూమ్ సెషన్ వినాలని ఉంటుంది. కానీ కొంత మంది ఉద్యోగానికి వెళ్ళాలి, షాపులకి వెళ్ళాలి, బయటికి వెళ్ళాలి, వంట చేయాలి, ఇంటి పనులు, పిల్లలు ఇలాంటి కారణాలు ఎన్నో ఉంటాయి. అది కూడా దాటాలి అంటే భగవంతుడి కృప వుండాలి. మరి ఆ కృప ఎలా కలుగుతుంది? మీ ఆలోచన, మాట, చేత ఒకటైనప్పుడు

అంటే త్రికరణ శుద్ధి ఉన్నప్పుడు దైవ కృప కలుగుతుంది.

ఆత్మ గొప్పది అని నువ్వు చెప్పి ఆత్మ కోసం ప్రయత్నించకుండా పూజ చేసుకుంటూ కూర్చుంటే, బయట ప్రయత్నాలు చేస్తే నీకు త్రికరణ శుద్ధి లేనట్టే. ఈ త్రికరణ శుద్ధి ఉన్నవారినే దైవం మెచ్చుకొని, వారికి అనుకూలమైన పరిస్థితులు కలుగచేస్తాడు.

కష్టాలు అనే సముద్రం ఎందుకు దాటడం అంటే? ఈ దేహం ఉండగానే దేహాన్ని సృష్టించిన వాడిని తెలుసుకోవాలి అని ఒక చిన్న షరతు పెట్టి భగవంతుడు ఈ మానవ జన్మ ఇచ్చాడు. నువ్వు దుఃఖాలను దాటే మార్గం నా దగ్గరికి వచ్చే ప్రయత్నం చేయడమే అని భగవంతుడే నిర్ణయించాడు. ఆయన నేను నీకు గురువుని ఇస్తాను, అవకాశాలు ఇస్తాను, ఈ అవకాశాలను ఉపయోగించుకుంటూ ఆ గురువు చెప్పిన సాధన చేసి, గురువు ఏ సత్య మార్గాన్ని నీకు బోధించాడో ఆ సత్య మార్గంలో పయనించగలగాలి అనే షరతు పెట్టాడు.

సముద్రం ఉంది, నావ ఉంది, నావను నడిపే నావికుడు ఉన్నాడు, ఎక్కి కూర్చోకుండా వర్జం, దుర్ముహూర్తం చూసుకుంటానంటే ఈలోగా తుఫాను రావచ్చు, నావ విరిగిపోవచ్చు, నువ్వు ఎక్కకపోతే నావ వెళ్ళిపోవచ్చు. అందుకే అన్ని అవకాశాలు నీకు కల్పించినా ప్రయత్నం మాత్రం నువ్వే చేయాలి, భగవంతుడు ఎంత చక్కని షరతు పెట్టాడో చూడండి.

అందుకే ఇంకో విషయం చెప్పారు మహాత్ములు. అన్ని అవకాశాలు ఉన్నా భగవంతుని చేరుకునే ప్రయత్నం చేయకపోతే నీకు ఇవ్వబడిన సంపదలన్నీ హరించడానికి ప్రకృతి సిద్ధంగా ఉంటుంది. అంటే అన్ని అవకాశాలతో కొంతమంది పుడతారు. అంటే డబ్బు వెతుక్కోనక్కర్లేదు, చక్కని భర్త, చక్కని తల్లిదండ్రులు, చక్కని పిల్లలు ఉంటారు. సాధన చేసుకోడానికి అవకాశం ఉంటుంది, ఖాళీ ఉంటుంది, గురువు వచ్చి చెప్తాడు కానీ నీలో బద్ధకం, సోమరితనం ఉంటే, చేద్దాంలే అని సాధన చెయ్యకుండా అశ్రద్ధ

చేస్తే సంపదలన్నీ హరించడానికి ప్రకృతి సిద్ధంగా ఉంటుంది అని ఋషులు హెచ్చరిక చేశారు.

గురువు వచ్చినా, అన్నీ తెలిసినా చేయలేకపోతున్నావు అంటే అది నీ సోమరితనం. ఈ సోమరితనాన్ని భగవంతుడు క్షమించడు, నీలో భగవంతుడు ఆత్మగా ఉన్నాడు. నీ శరీరంలో తమోగుణం వల్ల వున్న సోమరితనాన్ని తొలగించుకుని సాధన చేస్తే భగవంతుడి మీద ఆసక్తి కలుగుతుంది.

మరి పత్రి గారు ఆహార నియమాలు పాటించమని చెప్పారు, రాఘవరావు గారు కూడా చెప్తున్నారు. కానీ ఈ మిగిలిపోయింది పారేయలేక ఫ్రిజ్లో పెట్టుకొని మరీ తింటున్నారు. అసలు ఎక్కువ వండుకోవడం ఎందుకు? పారేయలేక తిని సోమరితనాన్ని పెంచుకోవడం ఎందుకు? మరి తమోగుణ ఆహారం బద్ధకాన్ని పెంచడం వల్ల భగవంతుడికి దూరమవుతారు. అప్పుడు నష్టపోయేది ఎవరు?

ఆ ఫర్వాలేదు వచ్చే జన్మలో చేసుకుందాం అనుకుంటారు. కానీ ఇక్కడ నీకు ఋషులు ఇచ్చే సందేశం ఏమిటంటే? భగవంతుడు నీకు ఏ సమస్య లేకుండా కావలసిన సంపదలు ఇచ్చి, నువ్వు జ్ఞానం పొందడానికి గురువును ఇస్తే, చేద్దాంలే, చూద్దాంలే అనే నిర్లక్ష్య ధోరణితో ఉంటే, ఇచ్చిన ఆ అవకాశాన్ని ఉపయోగించు కోకపోతే ఏ అవకాశాలు భగవంతుడు ఇచ్చాడో అవన్నీ వెనక్కి తీసుకోబడతాయి.

ఎందుకంటే అన్నిటికంటే మహా పాపం దారి తెలిసినా ప్రయాణం చేయకపోవడం; మోక్షం పొందడానికి నీకు గురువుని పంపినప్పుడు అది నువ్వు ఉపయోగించుకోకపోవడమే అతి పెద్ద తప్పు. భోగాలు అనుభవించడానికి సంపదలు కాదు, యోగంలో జీవించడానికి సంపదలు. ఆ యోగంలో జీవించకపోతే హరించబడతాయి.

అంటే ఇక్కడ గమనించండి రాఘవరావుగారు వ్యాపారాలు మానేసినా

యోగంలో ఉన్నారు కాబట్టి సంపదలు రెట్టింపు అవుతున్నాయి, ఆ యోగమే లేకపోతే ఈ సంపదలు మా దగ్గర నుంచి మా పిల్లలే తీసుకుంటారు.

ఈ రోజు మా పిల్లలు నాన్నగారు చేసే పని చాలా మంచి పని అని వాళ్ళేం మాట్లాడరు. అదే మేము ప్యాలెస్ కట్టుకుని, పెద్ద ప్లాస్మా టీవీ పెట్టుకుని ఎంజాయ్ చేస్తే ఈ ముసలోడికి ఎందుకు ఇవన్నీ, మాకు ఎప్పుడు ఇస్తాడా అని చూస్తారు. ఇవ్వకపోతే బలవంతంగా వ్రాయించుకుంటారు. ఇక్కడ రెండు ఉంటాయి భగవంతుడి మార్గంలో నువ్వు పయనించినప్పుడు ప్రకృతి ద్వారా నీకు అన్నీ ఇవ్వబడతాయి .

కానీ నీకు అన్నీ ఇవ్వబడినా, అవకాశం వచ్చినా నువ్వు సాధన చేయకుండా, అశ్రద్ధ, సోమరితనంతో గొప్ప అవకాశం పోగొట్టుకుంటే ఒక్క లక్ష్మి కాదు మీ చుట్టూ ఉన్న అష్టలక్ష్ములూ పోయి, దరిద్ర దేవత మీ ఇంట్లో తాండవిస్తుంది. ఇది ప్రకృతి యొక్క శాసనం, ఇది ధర్మ మార్గంలో చెప్పబడింది.

ఈ దేహాన్ని కదిలిస్తున్నది ఆత్మే. నీ దేహం కానీ, మనసు కానీ, ఆత్మ వల్లే పని చేస్తున్నాయి అని అనుక్షణం ఎరుకలో ఉండాలి. ఆత్మే లేకపోతే ఈ శరీరం మృత ప్రాయం అవుతుంది. ఈ శరీరానికి వైభవం ఇస్తున్న ఆత్మని దర్శించే మార్గం ధ్యానం. పరమాత్మ కృప ఉంది కాబట్టే ఇన్ని అవకాశాలు వచ్చాయి అని అనుకుంటూ జీవించగలగాలి.

అయితే ఇన్ని తెలుస్తున్నా ఎందుకు రాలేకపోతున్నారు అంటే ఐదు గొలుసులతో బందీ అయ్యారు. మరి ఏమిటా 5 గొలుసులు అంటే ?

1) చిన్నప్పటి నుంచి ఆధ్యాత్మిక మార్గం తెలియక, ఆత్మే గొప్పదని తెలియక శరీరం కోసమే పాటుపడుతూ, శరీరమే నేను అనుకోవడం ఒక గొలుసు.

2) శరీర సంబంధమైన బంధువుల మీద మితి మీరిన బంధం ఇంకొక గొలుసు.

ఉదా:- ఆ పెళ్లి వచ్చింది వెళ్ళొద్దాం అనుకోవడం, వెళ్ళడం.

నా కూతురికి కష్టం వచ్చింది చూసుకోవాలి కదా? అని అనుకోవడం, బంధువులతో బంధాలను ఏర్పరచుకోవడమే ఇంకొక పెద్ద గొలుసు.

3) ఆస్తిపాస్తుల మీద మమకారం, బంధువుల మీద మమకారం, రక్త సంబంధీకుల మీద మమకారం. మా ఊరు, మా గ్రామం, మా పల్లె, మా సిటీ, మా రాష్ట్రం, మా దేశం అనుకుంటూ మమకారంలో పడి కొట్టుకోవడం అంటే నావి నావి అనుకుంటూ మమకారాన్ని పెంచుకోవడమే ఇంకొక గొలుసు.

4) ఆధ్యాత్మికత లోపించడం వల్ల, జ్ఞానం వల్ల ఏం వస్తుందో తెలియక ప్రాపంచిక గ్రంథాలు అంటే భక్తికి సంబంధించిన మరియు నవల్సు లాంటివి చదువుతూ పుణ్య కర్మల మీద మోజు పెంచుకుంటూ, అజ్ఞానంతో అవే చేస్తూ వుంటారు, అది కూడా ఒక గొలుసే.

అంటే చూడండి కార్తీక మాసం వస్తే కార్తీక పురాణం చదివితే పుణ్యం అంటారు. మరి అది చదివి దీపాలు వెలిగిస్తే  స్వర్గలోకం వస్తుంది అని దీపాలు వెలిగిస్తారు, కానీ స్వర్గాన్ని మించి మోక్షం ఒకటి వుంది అని తెలుసుకోవాలి. చూడండి శివుడు ఇంకా ధ్యానం చేస్తున్నాడు, అందుచేత దైవం ఏం చేస్తే మీరూ అదే చేస్తే దైవం మెచ్చుకుంటాడు కానీ దీపాలు పెడితే లాభం లేదు అని తెలుసుకోవాలి.

**"ఇంట్లో దీపం పెడితే ఇంటికి వెలుగు, ఊర్లో దీపాలు పెడితే ఊరికి వెలుగు, నీలో దీపాన్ని వెలిగిస్తే నీ జీవితమే వెలుగు".** ఆ వెలిగించుకునే మార్గమే ధ్యానం. కానీ  ఆధ్యాత్మిక గ్రంథాల పరిచయం లేక ఈ పురాణాలు చదువుతూ, భౌతిక శాస్త్రాల గురించి చదువుతూ, భౌతికంగా చెప్పే పుణ్య కర్మల మీద మోజు పెంచుకుంటూ అజ్ఞానంతో అవే చేస్తూ వుంటే అది కూడా ఒక గొలుసే.

5) ఆత్మతత్వం తెలియక అంటే ఆత్మ శరీరంలో ఉండి శరీరాన్ని కాపాడుతుంది, సృష్టి అంతా ఉండి సృష్టిని కాపాడుతుంది అని భగవంతుని తత్వం తెలియక భౌతికమైన కర్మల మీద మోజు పెంచుకుంటూ అవే

చేసుకుంటూ వుంటారు. మరి భగవంతుని చేరుకునే మార్గమైన ఈ ధ్యాన సాధన చేసి జ్ఞానం పొందకపోవడమే ఐదవ గొలుసు.

ఇలా గొలుసులతో బంధించ బడుతుంది శరీరము, మనసు.

కొంతమంది చూడండి ఎంత సాధన చేసినా పూజ మానరు. ధ్యానం అయినా మానేస్తారు కానీ పూజ మానరు. అలాగే కొంతమంది ఇది చేయకపోతే ఎలాగ? అది చేయకపోతే ఎలాగ? మన ఇంట్లో ఇది ఆనవాయితి అని వీటి మీద మోజు పెంచుకుంటారు. అంటే ఈ ఐదు గొలుసులతోటి బంధీ అయి బంధంలో ఇరుక్కుని భగవంతుడికి దూరమవుతున్నామనే ఎరుకను కోల్పోతారు.

కానీ ఋషులు ఏమంటున్నారంటే? మానవ జన్మలో ముందు తమో, రజోగుణాలలో నువ్వు ఎన్ని తప్పులు చేసినా సత్యం నీకు తెలిసింది అంటే నువ్వు సాత్విక గుణంలోకి వచ్చావు అని అర్థం చేసుకో అంటారు. కనుక సత్వ గుణంలోకి వస్తే కానీ సాధనలోకి రాలేరు, సత్యాన్ని అర్థం చేసుకోలేరు. సత్వగుణంలో లేనప్పుడు తమోగుణం, రజోగుణంలో భగవంతుడికి దూరంగా ఉంటారు, ద్వైతంలో ఉంటారు.

సత్వగుణంలోకి వచ్చినప్పుడు, సత్యం అర్థమైనప్పుడు, నేను భగవంతుడు ఒక్కటే అనే సత్యాన్ని బోధపరుచుకుని అర్థం చేసుకుంటారు. ఎప్పుడైతే నీ గురువు వచ్చి జీవుడు, దేవుడు ఒక్కటే అని నీకు చెప్తాడో వీటిన్నిటి మీద బంధం వదులుకోవాలి.

ఈ ఐదు గొలుసులతో బంధింపబడి ఉన్న మీరు ఈ బంధాలను ఎలా వదులుకోవాలి అంటే? "వైరాగ్యం". నేను దేని మీద బంధం ఏర్పరచు కున్నానో అవన్నీ ఏదో ఒక రోజు నన్ను వదిలి వెళ్ళిపోతాయి లేదా వీటన్నిటిని వదిలి నేను వెళ్ళిపోతాను, ఏది శాశ్వతం కాదు అనుకోవడమే వైరాగ్యం. వైరాగ్యం అంటే వదిలి వెళ్ళిపోవడం కాదు. సత్యాన్ని తెలుసుకుంటూ, అసత్యాన్ని వదలడం.

వైరాగ్యం అంటే కాషాయాలు కట్టుకొని అడవులకి వెళ్ళడం కాదు,

అన్నిటిని అనుభవించడానికి మాత్రమే నాకు హక్కు ఉంది, ఏవీ నా కూడా తీసుకెళ్లలేను, ఇవన్నీ నేను వదలవలసిందే అని తెలుసుకోవాలి. భగవంతుడి తోటే నా జన్మ జన్మల బంధం, ఈ శరీరం ఉన్నంతవరకు ఇలా అనుభవిస్తూ నేను పరమాత్మ దర్శనం కోసం ప్రయత్నిస్తాను అని నిర్ణయించుకోవాలి. అంతేకాదు ఆయన మీదే నాకు మమకారం ఉండాలి అని తెలుసుకోవాలి.

ఈ ప్రకృతి ఇచ్చిన వనరులన్నీ నేను అనుభవించడానికే తప్ప పట్టుకెళ్లేది ఏది లేదు, ఒట్టి చేతులతో వస్తున్నాను, వట్టి చేతులతో వెళ్ళిపోతాను, నేను పొందిన జ్ఞానమే నన్ను నా స్వస్థలానికి తీసుకు వెళ్తుంది అని తెలుసుకోవాలి. భూమిమీద బంధాలు వదులుకోకపోతే నా ఇంట్లో అంటే భగవంతుని దగ్గర నాకు చోటు లేదు అని తెలుసుకుని వీటన్నిటిని వైరాగ్య భావంతో అనుభవిస్తూ, సాధన చేస్తూ, జ్ఞానాన్ని పెంచుకుంటూ ఉండాలి.

ఆ జ్ఞానం ద్వారా మీరెవరో మీరు తెలుసుకుంటూ పరమాత్మతో బంధాన్ని గట్టిపరుచుకోవాలి. అలా గట్టిపరచుకోవడం ఒక్క మానవ జన్మేలోనే సాధ్యం. మరి పరమాత్మ అద్భుతమైన గురువుని, అద్భుతమైన అవకాశాల్ని ఇచ్చాడు. వాటిని ఉపయోగించుకుని సాధన చేస్తూ, జ్ఞానం పెంచుకుంటే! ఆ జ్ఞానమే మిమ్మల్ని ఉన్న స్థితి నుంచి, ఉన్నత స్థితికి తీసుకువెళ్తుంది. ఆ జ్ఞానమే మిమ్మల్ని ఆ పరమాత్మ దగ్గరికి చేరుస్తుంది. ఆయన సాంగత్యం పొందినప్పుడే కోల్పోయిన ఆనందాన్ని పొందుతారు, ఇదే జీవిత పరమార్థం.

# ఉత్తమోత్తముడిగా ఎదగాలి అంటే?

ఈ భూమి మీద మీరు ఎన్నో రకాల జన్మలు తీసుకుంటూ చిట్ట చివరికి మానవుడుగా వచ్చారు. అలా వచ్చిన మీరు ఎప్పుడైతే ఆధ్యాత్మిక జీవితంలోకి ప్రవేశించారో అవే చివరి జన్మలు అని అర్థమవ్వాలి. మరి అలా అర్థమైనప్పుడు మీ ప్రయత్నం ఇంకా తీవ్రంగా వుంటుంది.

చూడటానికి మానవులంతా ఒకలాగే ఉంటారు. కానీ వాళ్ళ మనోస్థితిని బట్టే వారి ప్రవర్తన ఉంటుంది. ఒక్కొక్కసారి ఎంత చెప్పినా వీళ్ళు ఎందుకు వినట్లేదు? మారట్లేదు? అనే ఒక సందేహం కూడా వస్తూ ఉంటుంది. మహాత్ములు ఎన్నో చెప్పారు కానీ, మీరు అవన్నీ అధ్యయనం చేయక ఆవేదన పడతారు. మరి మహాత్ములు చెప్పినవన్నీ నేర్చుకున్నప్పుడు గతంలో ఇలాగే వున్నాము, అవన్నీ దాటి చివరికి ఇలా వచ్చాము అంటే ఆ స్థితి నుంచి ఈ స్థితికి వచ్చాము అని తెలుసుకుంటారు.

అంటే అందరినీ సాక్షిగా గమనిస్తూ, ప్రేమిస్తూ వుంటారు. మరి మీరు అంతకు ముందు అలా లేము అనుకుంటే? ప్రస్తుతం నేను జన్మ తీసుకుని సాధన చేస్తున్నాను, జ్ఞానం పెంచుకుంటున్నాను, సద్గురువును పొందాను, నాకన్నీ తెలిసాయి అని ఒక చిన్న అహం మీలో వస్తుంది.

ఎందుకంటే మాయ మీ ప్రక్కనే ఉంటుంది. గమనిస్తే మానవుడి ప్రక్కన మాయ, మృత్యువు రెండూ రెండు రెక్కల్లా ఉంటాయి. ఆధ్యాత్మికంగా ఎదగకుండా చేసేది మాయ, ప్రయత్నం చేయకుండానే జీవితాన్ని పూర్తి చేసుకోవడం మృత్యువు. మరి ఆధ్యాత్మిక మార్గంలో ఈ స్థాయికి వచ్చాక ఈ రెండు సత్యాలు మీకు తెలుస్తాయి.

మాయ ప్రపంచం వైపు లాగుతుంది. అందుచేత మీ రోజులు దగ్గర పడుతున్నాయి, అందుకే నేర్చుకోవాల్సింది బద్ధకించకుండా, అశ్రద్ధగా లేకుండా నేర్చుకో అని ప్రతీదీ మిమ్మల్ని మృత్యువు తప్పదని హెచ్చరిస్తూనే ఉంటుంది.

అంటే నువ్వేమి భూమి మీద శాశ్వతంగా ఉండిపోవు, మరణించేలోగా ఎన్ని తెలుసుకోవాలో అన్నీ తెలుసుకోవాలి అని గురువులు మిమ్మల్ని హెచ్చరిస్తూనే వుంటారు.

అన్నిటిని, అందరినీ తీసుకు వెళ్ళగలిగే మృత్యువుకి సాధన చేసే మానవుడిని మాత్రం తీసుకువెళ్ళడం చాలా కష్టమట. ఎందుకంటే వాళ్ళ జీవితాన్ని వాళ్ళకి ఇష్టం వచ్చినట్టు ఉంచుకోగలిగే శక్తి ఒక్క సాధకులకే ఉంది అంటారు. అందుకే ప్రతిదాన్ని కబళించగలిగే శక్తి మృత్యువుకు ఉంటే, మృత్యువునే శాసించే శక్తి మానవుడికే ఉందట.

మరి అంత శక్తివంతుడైన మానవుడు తనలో ఉన్న ఆ శక్తిని ఉపయోగించుకోలేక నిర్వీర్యుడై నేను ఎందుకూ పనికి రాను, నాకు దైవం ఇంకా ఇవ్వాలి, ఇంకా ఇవ్వాలి అని తన శక్తి తనకి తెలియక విలవిల్లాడుతూ ఉంటాడు. మరి అలా ఎంతవరకు విలవిల్లాడతాడో? అంతేకాదు ఎలాంటి వాళ్ళకి మృత్యువును కూడా శాసించగలిగే శక్తి ఉంటుందో తెలియాలంటే భూమి మీద ఉన్న రకరకాల మానవుల గురించి తెలుసుకోవాలి. అప్పుడు మీరు ఎంతవరకు ఎదగారు అన్నది అర్థమవుతుంది.

భూమిమీద మానవులు ఐదు రకాలుగా ఉంటారట.

1) అధమాతి అధముడు, 2) అధముడు, 3) మధ్యముడు, 4) ఉత్తముడు, 5) ఉత్తమోత్తముడు.

పైకి అందరూ మానవ ఆకారంతో ఉన్నా వాళ్ళ మనసును బట్టి వాళ్ళ ప్రవర్తన ఉంటుంది, వాళ్ళు నేర్చుకోవడం ఉంటుంది, సాధించడం ఉంటుంది.

**1) అధమాతి అధములు :-**

వీళ్లు ఎలా ఉంటారంటే? తనలో లేని గొప్పలు చెప్తూ, ఎదుటివారిలో లేని లోపాలని అందరికీ చెప్తూ ఉంటారట. ఇప్పుడు ఈ రకం జనమే ఎక్కువ ఉన్నారు.

తనలో లేని గొప్పలు అంటే తనకు తానే చాలా గొప్పవాడిని అనుకునేవాడు లేని గొప్పలు చెప్పుకుంటాడు. మరి నిజంగా తాను చాలా గొప్పవాడా? అంటే ఎవరు ఆధ్యాత్మికంగా ఉన్నత స్థితిలో వుంటారో వాడే గొప్పవాడు. ఆధ్యాత్మికత ఆవగింజంతైనా లేకుండా ప్రాపంచిక సంపదలు ఎన్ని ఉన్నా వాడు గొప్పవాడు కాదు. ఒకవేళ ప్రాపంచిక సంపదలు లేకపోయినా ఉన్నట్టు నటిస్తే వాడు అధమాతి అధముడు.

అప్పు చేసైనా పది మంది ముందు గొప్పగా జీవించాలి అనుకునే వాడు నిజంగా భగవంతుడు దృష్టిలో అధమాతి అధముడు. ఎందుకు అంటే? ఎవరి పుణ్యాన్ని బట్టి వాళ్ళకి భగవంతుడు ఇస్తూనే ఉంటాడు. ఆ ఇచ్చింది నా పుణ్యం కొద్దీ వచ్చింది, ఇది భగవంతుడి ప్రసాదము అని తెలియని మూర్ఖులు ఉన్నదానితో తృప్తి పడకుండా పది మంది తనని గొప్పగా అనుకోవాలి అని అప్పు చేసైనా గొప్పగా ఖర్చు పెడుతూ ఉంటారు.

నేను ఇది చేశాను, అది చేశాను, ఈ కారు కొన్నాను, ఆ మేడ కొన్నాను, వాడు చూడండి ఎంత పిసినారి వాడో, ఏమీ అమర్చుకోడు ఎప్పుడూ అలాగే ఉంటాడు అని తన గొప్ప చెప్పుకుంటూ ఎదుటి వాడిని విమర్శిస్తాడు. వీడు జీవితంలో ఎప్పుడూ మారడు. ఎందుకంటే బుద్ధుడు నీలో ఒక్క తప్పు ఉన్నా సరి చేసుకో అని చెప్తాడు.

మరి నేను ఎంతో గొప్పగా జీవిస్తున్నాను అని గొప్పలు చెప్పుకున్న వాడు, ఎప్పుడు కూడా తనకు తానే గొప్ప అనుకున్నవాడు ఎదుటి వాళ్ళ నుంచి ఏది నేర్చుకోవడానికి ప్రయత్నించడు. వీళ్ళు గొప్పకి గుడికి కూడా వెళ్లి అక్కడ కూడా ప్రకటనలు చేస్తారు.

మరి అలాంటి వాళ్ళు జీవితంలో ఎవరికీ ఏదీ పెట్టరు, ఏదీ సాధించ లేరు. గమనించుకోండి మొదటి రకం మనుష్యులు జీవితాంతము తన గొప్పే చెప్పుకుంటారు కానీ, ఆధ్యాత్మిక జీవితంలోకి అడుగు పెట్టడానికి కూడా ప్రయత్నం చెయ్యరు.

**"అప్పు చేసి పప్పు కూడు తినకురా.. ఉన్నంతలో ఉప్పు వేసుకునైనా నీతి కూడు తినరా"** అన్నారు పెద్దలు. అంటే డబ్బు లేకపోయినా అప్పులు చేసి, లోన్లు తీసుకుని తనకు లేకపోయినా గొప్పలు చెప్పుకుంటూ ఎదుటివాడు కొంచెం జాగ్రత్తగా ఉంటే వాడు చాలా పిసినారి, అనుభవించడం కూడా తెలియదు అని చెప్తారు. అది వాడిలో దుర్గుణం కాదు జాగ్రత్తగా ఉండడం, కానీ అది దుర్గుణం కింద చెప్తారు. మరి అలా చెప్తూ ఉంటే అది అధమాతి అధముల లక్షణం.

**2) అధములు:-**

వీరు లేని గొప్పలు చెప్పుకోరు కానీ, తమకున్నవి గొప్పగా చెప్పుకుంటూ ఉంటారు. ఏ అప్పూ చేయరు, ఆస్తిపాస్తులు ఉన్నాయి, పెద్ద జీతం ఉంది, పెద్ద చదువు ఉంది, అందం ఉంది. అలా వారికున్నవి అందరికీ బాగా చెప్పుకుంటూ ఎదుటివారికి లేదనట్టుగా వెక్కిరిస్తారు, ఇది అధముల లక్షణం.

మీకు ఉంటే ఉండొచ్చు కానీ, ఎదుటివారికి లేదని వెక్కిరించడం అన్నది చాలా తప్పుడు లక్షణం. ఆధ్యాత్మికతలోకి రాని వారు, ఆత్మ గురించి తెలియని వారు, ఎదుటి వారిని చులకనగా చూస్తూ ఉంటారు. అందరూ ఆత్మ స్వరూపులే అని తెలుసుకున్న జ్ఞానులు ఎవ్వరినీ తక్కువగా చూడరు. తన గొప్ప చెప్పుకుంటూ ఎదుటివారిని చులకనగా, నీచంగా చూస్తే ఇది అధముడి లక్షణం.

**3) మధ్యముడు :-**

తనలో లోపాలు ఉన్నాయని, ఎదుటివారిలోనూ లోపాలు ఉన్నాయని తెలుసుకున్నవారు మధ్యములు. వీళ్ళు ఇక్కడ మూడవ మెట్టుకి వచ్చాక ఎందుకు నేను ఎన్ని చేసినా నాకు దుఃఖం పోవట్లేదు? అలాగే నాకే కాదు ఈ ప్రపంచంలో ప్రతి వారిలోనూ దుఃఖం ఎందుకు ఉంది? అని వీళ్ళకి ఆలోచన వచ్చినప్పుడు ఆధ్యాత్మిక జీవితంలోకి అడుగు పెడతారు.

అధమాతి అధములు, అధములు ఆధ్యాత్మికంలోకి రారు. మధ్యమ స్థితిలో ఉన్న మానవుడికి దుఃఖానికి కారణం తెలుసుకోవాలి అనే ఆలోచన వచ్చినప్పుడు ఆ పరమాత్మే వారి జీవితంలోకి ఒక సద్గురువుని పంపిస్తాడు. సద్గురువు కారణం చెప్తాడు, అంటే గతంలో చేసిన పాపం వల్లే వర్తమానంలో ఈ వ్యాధులు, కష్టాలు, నష్టాలూ వస్తాయని.

మరి పత్రిగారు **"చిన్న చిన్న పాపాలే చిన్న చిన్న రోగాలు, పెద్ద పెద్ద పాపాలే పెద్ద పెద్ద రోగాలు, పాపమే లేకపోతే రోగమే లేదు"** అని చెప్పారు. మీరు ప్రాపంచిక జీవితంలో గమనిస్తే మీకే కాదు ప్రతి వారి జీవితంలోనూ దుఃఖముంది, అనారోగ్యం, కష్టాలు, పేదరికం కూడా వుంటాయి. ఇవే దుఃఖంలాగా అనిపిస్తాయి.

కానీ గురువు వచ్చాక దుఃఖానికి కారణం ఏమిటి? లోపం ఎక్కడుంది? అన్నది తెలుసుకుంటారు. మరి పత్రిగారు వచ్చేవరకు మాంసాహారం పాపము అని ఎవ్వరికీ తెలియదు. ఏదో పండగ రోజున, పూజ రోజున మానేయవచ్చు, కానీ మామూలు రోజుల్లో అందరూ తిన్నారు. కానీ పత్రి గారు వచ్చాక సకల దుఃఖాలకి కారణం మాంసాహారం అని తెలుసు కున్నారు.

అంతకుముందు కష్టం వస్తే వాడేదో కారణం, వీడేదో కారణం అనుకున్నారు. ఇంకా నాలో లోపం ఉందేమో వ్యాపారం కలిసి రావట్లేదు, నేను ఎన్ని పూజలు చేసినా సంతోషం లేదు అనుకున్నారు. అంటే తనలో ఏ లోపం ఉందో తెలీదు, ఎదుటి వాడిలో ఏ లోపం ఉందో కూడా తెలియదు. కానీ లోపం వల్ల దుఃఖం వస్తుందని అందరికీ తెలుస్తుంది, ఇది మధ్యమ స్థితి.

ఈ స్థితిలోనే జీవితంలోకి ఒక సద్గురువు వచ్చి కారణం చెప్తాడు. గతంలో పాపం చేశావు దాని వల్ల ఇప్పుడు దుఃఖం అనుభవిస్తున్నావు. ఇప్పుడు చేయకు అని చెబుతాడు. ఎదుటివాడికి ఎన్నో సంపదలు ఉన్నాయి,

సౌభాగ్యం ఉంది అయినా వాడికి దుఃఖం ఉంది. మరి వాడిలో ఏం లోపం? ఇలా తనలో లోపాలు, ఎదుటి వాడిలో లోపాలు గమనించినవాడు మధ్యముడు అవుతాడు.

**4) ఉత్తముడు:-**

తనలో లోపాలను గమనించుకుంటూ, ఎదుటివాడిలో మంచిని గమనించేవాడు ఉత్తముడు. ఓ.. నేను ఈ లోపం వల్ల దుఃఖ పడుతున్నాను, వాడు చేసే మంచి వల్ల వాడు ఆనందంగా ఉన్నాడు అని గురువులు చెప్పినపుడు అర్థమవుతుంది. **"పెట్టి పుడితేనే సౌభాగ్యం"** అంటారు కదా? వాడు పెట్టాడు, పెట్టగలిగే కుటుంబంలో పుట్టాడు, ఆనందంగా ఉన్నాడు. నేను గత జన్మలో ఏదీ చేయలేదు అందుకే ఈ పరిస్థితి అని తెలుసుకోవడమేకాదు, ఈ జన్మలో చేస్తాడు.

అప్పటివరకు నేను జీవుడ్ని, దేవుడు ఎక్కడో ఉన్నాడు అనుకుని ఎన్నో తీర్థయాత్రలకు వెళ్లేవాడు, ఎన్నో పూజలు చేసేవాడు, ఎన్నో నదీ స్నానాలు చేసేవాడు, ఎన్నో యజ్ఞయాగాదులు చేసేవాడు ఇవన్నీ కూడా పుణ్యకర్మలు. కానీ గురువు వచ్చాక భగవంతుడు ఎక్కడో లేడు, నీ శరీరంలో ఆత్మగా ఉన్నాడు అని తెలుసుకుంటాడు.

ఇంద్రియాలకు బానిస అయినవాడు జీవుడు. ఇంద్రియాలకు బానిస కానివాడు దేవుడు అవుతాడు. ప్రాపంచిక జీవితంలో ఇది లేదు, అది లేదు అనుకుంటారు, అంటే ఇంకా ఎక్కడో ఇంద్రియాలకు బానిసలవుతున్నారు.

ఏదీ పట్టించుకోకపోవడం వల్లే దుఃఖం ఉండదు, పట్టించుకుంటే అన్నీ దుఃఖాలే. శరీరం, మనసు, బుద్ధిని దాటి ఆత్మ స్థితిలోకి వచ్చినవాడు ఏది పట్టించుకోడు, ఏ బంధంలో కూరుకుపోడు.

అందుకే ఉత్తముడు తనలో ఏ లోపం వల్ల దుఃఖ పడుతున్నాను? అవతలవాడు ఏది చేసి అంత ఆనందంగా ఉన్నాడు? అనేది గమనించి తనలో లోపాలను సరి చేసుకుంటాడు. సాధనలోకి వచ్చాకే ఈ మార్పు వస్తుంది.

ఎదుటివాడిలో లోపాలను చూడడు, మంచినే చూసి ఆ మంచినే నేర్చుకుంటాడు.

అందుకే బుద్ధుడు చెప్తాడు **"ఎదుటివారిలో 99 తప్పులు ఉన్నా ఒక మంచి ఉంటే నువ్వు అది నేర్చుకో, నీలో 99 మంచి ఉన్నా ఒక తప్పు ఉంటే మార్చుకో"** ఉత్తముడు తనలో వీసమెత్తు లోపం ఉన్నా సరిచేసుకుంటాడు, ఎదుటివారిలో మంచినే చూస్తాడు.

అధమాతి అధములు, అధములు నేర్చుకోవడానికే ప్రయత్నించరు వారే గొప్ప అనుకుంటారు. ఇక మధ్యముడికి దుఃఖానికి కారణం ఏమిటి అనే ఆలోచన వస్తుంది, ఉత్తముడు నేర్చుకోవడం మొదలు పెడతాడు. నేర్చుకున్నాక దుఃఖానికి కారణాలు నేను సాధన చేయకపోవడమే, జ్ఞానం పెంచుకోకపోవడమే అని తెలుస్తుంది. ఈ రెండు నా దగ్గర ఉంటే నేను గొప్పగా ఎదుగుతాను. అని తెలుసుకుంటాడు. మరి సాధన చేస్తూ, జ్ఞానం పెంచుకుంటూ ఉత్తమోత్తముడిగా ఎదుగుతాడు.

**5) ఉత్తమోత్తములు:-**

వీరు ఎదుటివారిలో కానీ, తనలో కానీ దోషాలు ఎంచకుండా, ఎదుటి వాళ్ళని విమర్శించకుండా, ఇది మంచి, ఇది చెడు అనకుండా, ప్రతి వాళ్ళని సాక్షిగా గమనిస్తూ ఆత్మ స్థితిలో ఉంటారు. అంటే తాను ఒక్కడే కాదు, తన చుట్టూ వున్న సర్వజీవులూ ఆత్మ స్వరూపాలే, కొన్ని అనుభవాల కోసం అట్లా ఉంటారు అని తెలుసుకుంటాడు.

తాను ఉత్తమోత్తముడు అని కూడా తాను అనుకోడు. ఎందుకంటే వాళ్ళకి ఎంతసేపు లోక కళ్యాణం కోసం పాటుపడాలనే ఆలోచనే కానీ జనం ఏమనుకుంటున్నారు అన్న ఆలోచన కూడా వాళ్ళకి ఉండదు.

పత్రిగారిని తీసుకుంటే పొగిడేవాళ్ళు పొగిడారు, విమర్శించేవాళ్ళు విమర్శించారు, తిట్టేవాళ్ళు తిట్టారు అన్నీ ఉన్నాయి. దూషణ, భూషణలన్నీ స్వీకరించి లోక కళ్యాణమే తన కళ్యాణంగా భావించి ఆయన జీవన్ముక్త స్థితిలో ఉన్నారు.

లోక కళ్యాణం చేసేవాళ్ళు ఎప్పుడూ కూడా ఎవరు విమర్శించినా వారి పని వారిదే. మంచీ, చెడ్డా చెప్తారు. ఆచరించేవారు ఆచరిస్తారు, ఆచరించకపోతే నేర్చుకుంటారు. పాఠశాలలో చేరినప్పుడు కొంతమంది మంద బుద్ధులు ఉంటారు, వాళ్ళు ఒక్కొక్క క్లాసు రెండేళ్ళు చదవచ్చు. ఆధ్యాత్మిక జీవితంలో కూడా అంతే. ఈ భూమి అనే అద్భుత పాఠశాలలో ఎన్ని జన్మలైనా తీసుకుని పాఠాలు నేర్చుకుంటారు.

ఒక ఆత్మగా భూమిమీదకి వచ్చినవారు పాఠాలు నేర్చుకోవడానికే వచ్చారని మరి ఉత్తమోత్తములకు తెలుసు కాబట్టి ఏమీ విమర్శించకుండా, సాక్షిగా గమనిస్తూ, అందరితోటి మిత్రత్వంలో ఉంటూ, ప్రతి వారికి నేర్పడానికి ప్రయత్నిస్తూ, లోక కళ్యాణకరమైన పనులు శక్తికి మించి కష్టపడి చేస్తారు. తన శరీరాన్ని చూసుకోరు, శరీర సుఖాలూ చూసుకోరు.

అది భగవంతుడు మెచ్చాడా? లేదా? అని మాత్రమే చూసుకుంటారు. భగవంతుడికి ప్రతిరూపంగా నేను భూమిమీదకు వచ్చాను కాబట్టి ఈ భూమిమీద నేను భగవంతుడిగా ప్రవర్తించాలి అని సత్యం తెలుసుకున్న మహాపురుషులు ఉత్తమోత్తములు. అందుకే వాళ్ళు ఆత్మని తెలుసుకున్నాక, ఆత్మగా జీవిస్తూ, అందరినీ భరిస్తూ, అందరి సుఖం కోసం ప్రయత్నిస్తూ, ఎంతో త్యాగం చేసిన త్యాగమూర్తులంతా ఉత్తమోత్తములు.

అంటే ఒక ఆత్మ భూమి మీదకు వచ్చి, అజ్ఞాన స్థితిలో కొన్ని జన్మలు గడిపి, ఏదో ఒక జన్మలో వేదన మొదలైనప్పుడు గురువు ద్వారా సాధన నేర్చుకుని, జ్ఞానాన్ని పొందుతున్నప్పుడు ఆనందం వస్తూ ఉంటుంది. అది పరాకాష్టకు వెళ్ళే వరకు ఎన్ని కష్టాలు, ఎన్ని నష్టాలు వచ్చినా మరి మధ్యముల స్థాయి నుంచి ఉత్తములు అవుతారు, ఆ తర్వాత ఉత్తమోత్తములు అవుతారు.

ఆ ఉత్తమోత్తములు అయినవారే లోక కళ్యాణం కోసం నిరంతరము శ్రమిస్తూ, నేర్చుకుంటూ, నేర్పుతూ ఉంటారు. ప్రతి ఒక్కళ్ళు ఇక్కడ ఒకటి అర్థం చేసుకోవాలి ఆత్మ దర్శనం అయితేనే ఆత్మ స్థితిలో ఉన్నట్టు కాదు.

నేను ఆ లోకాల నుంచి ఈ లోకానికి వచ్చానంటే నేర్చుకున్నది నేర్పడానికే వచ్చాను, నా జీవితంలోకి సద్గురువు వచ్చి నాకు ధ్యానం, జ్ఞానం ఎలా నేర్పాడో నేను కూడా ఒక గురువులాగ ఎదిగి నేర్పాలి, అందరూ ఆత్మలే అనే భావంతో, అందరికీ ధ్యానం చెప్పాలనే తపనతో బయటికి వెళ్లి చెప్పినప్పుడు మనం నిత్యమూ ఆత్మ స్థితిలో ఉన్నట్టే.

మీకు ఒక్కొక్క క్లాసు చెప్తున్నప్పుడు ఆనందం వస్తుంది అంటే అక్కడ మీరు ఆత్మానుభూతి పొందుతున్నట్టే. ఆత్మ అంటే ఏదో సినిమాలో చూపించినట్టు దీపం రాదు. లోపల నుంచి ఆనందం వస్తూ ఉంటుంది, అదే ఆత్మానుభూతి. ఆ అనుభూతి పొందాలి అంటే ఒక అధమాతి అధముడిగా భూమిమీద జన్మ తీసుకున్న మానవుడు ఉత్తమోత్తమ స్థాయికి ఎదగగలగాలి.

అందుకే ఒక మహాత్ముడు **"అజ్ఞానిగా పుట్టడం తప్పు కాదు, అజ్ఞానిగా చనిపోవడం తప్పు"** అన్నారు. మానవుడు చేసే పెద్ద పాపం ఏమిటంటే? మానవ జన్మ తీసుకుని మానవ జన్మకి కారణం తెలుసుకోకుండా, మరి భగవంతుడు ఎవరో తెలుసుకోకుండా చనిపోతే అంతకంటే పాపం ఇంకొకటి వుండదు.

అందుకే అజ్ఞానిగా పుట్టడం తప్పు కాదు, అజ్ఞానిగా మరణించడం తప్పు అన్నారు. ఒక వేళ పుట్టిన వెంటనే జంతు జన్మల నుంచి మానవ జన్మలోకి వచ్చి అజ్ఞానిగా ఉన్నా గొప్పవాళ్ళని చూసి అంటే యోగుల్ని, జ్ఞానుల్ని చూసి అందరూ వాళ్ళ కాళ్ళ మీద ఎందుకు పడుతున్నారు? వాళ్ళలో ఉన్న గొప్పతనం ఏమిటి? అని విచారణ చేస్తే వారు పొందిన జ్ఞానమే అని అర్థమైనప్పుడు అధమాతి అధముడిగా జన్మ తీసుకున్నా ప్రయత్నం చేత ఉత్తమోత్తముడిగా ఎదగుతారు.

అధముడిగా ఉన్నా ఉత్తమోత్తముడిగా ఎదగాలని తెలుసుకున్న రోజున ధ్యాన సాధనని ప్రేమిస్తారు, జ్ఞానాన్ని గౌరవిస్తారు, ఇంకా ఎదగడానికి ప్రయత్నిస్తారు.

# ప్రాపంచిక ధనం - ఆధ్యాత్మిక ధనం

ఈ భూమి మీద ధనం ఉన్నవారిని గొప్పవాళ్ళు అనుకుంటారు, కానీ ఆధ్యాత్మికంగా జ్ఞానం పొందిన వాళ్ళే గొప్పవాళ్ళు.

మరి ఆత్మజ్ఞానం పొందడానికి, ఆధ్యాత్మిక సంపదలు పొందడానికి అన్నీ వదిలి సాధనలో ఉన్న వారిని చూస్తున్నప్పుడు కూడా కొంతమందికి ఇది అర్థం కాదు. అంటే వారికి పూర్వజన్మ వాసనలు, సంస్కారాలు  వదలలేదు అని భావించవచ్చు. ఎందుకంటే ఆధ్యాత్మిక జీవితంలో అన్నిటికంటే సాధన, జ్ఞానం పొందడం ఎంత ముఖ్యమో, గత జన్మ వాసనలు పోగొట్టుకోవడం కూడా అంతే ముఖ్యం.

ఎవరైనా సత్యాన్ని తెలుసుకుంటూ జీవితంలో దేనికోసం శ్రమ పడాలి? ఈ సంపదల్లో ముందుకు ఎలా వెళ్ళాలి? అన్నది తెలుసుకోవాలి. సంపదలు అనగానే అందరికీ డబ్బు ఒకటే గుర్తు వస్తుంది, కానీ ధనం అనే పదానికి రెండు అర్థాలు తీసుకోవచ్చు. ఒకటి ప్రాపంచిక ధనం, రెండు ఆధ్యాత్మిక ధనం. మరి ప్రాపంచిక ధనం వల్ల వచ్చేవి ఏమిటి? ఆధ్యాత్మిక ధనం వల్ల వచ్చేవి ఏమిటి? అన్నది తెలుసుకుందాం.

## ప్రాపంచిక ధనం

ఈ ప్రాపంచిక ధనం ఆనేది మూడు రకాలుగా వస్తూ ఉంటుంది.

1) పూర్వజన్మలో చేసిన పుణ్య కర్మల వల్ల,

2) ఈ జన్మలో చేసే తీవ్ర కృషి వల్ల,

3) ఈ జన్మలో చేసిన పుణ్యకర్మల వల్ల.

డబ్బున్న ఇంట్లో జన్మ తీసుకున్నారు అంటే పూర్వజన్మలో చేసిన పుణ్యం వల్లే!

కానీ ఈ జన్మలో  చేసే కృషి వల్ల అంటే ధర్మంగా జీవించడం వల్ల అలాగే ఇతరులకు దానం చెయ్యడం వల్ల సంపదలు పెరుగుతూ వుంటాయి.

ఈరోజు భూమ్మీద ఎవరిని చూసినా తాను సుఖపడాలి, తన కుటుంబం సుఖపడాలి అనే ఆలోచనలతోటే ఉన్నారు కాని ధర్మపరమైన ఆలోచనలు కొద్దిమందికే ఉన్నాయి. ఈ ప్రాపంచిక ధనం పెరిగితే పెరిగేవి తెలుసుకుందాం.

**1) అహంకారం :-** ఎంతవరకు ఆత్మజ్ఞానం ఉండదో, ఎంతవరకు తానెవరో తెలుసు కోరో, వారు ప్రాపంచిక జీవితమే గొప్పదని భావిస్తూ పరమ అజ్ఞానంలో ఉంటారు. అంటే ఈ ధనమంతా నాదే, నా కృషి వల్లే వచ్చింది అనే అజ్ఞానమే అహంకారంగా మారుతుంది.

ఇలా అహంకారంగా మారినప్పుడు తానే గొప్ప అని అనుకుంటూ ప్రక్కవాడిని తక్కువగా చూస్తారు. ఈ అహంకారం వున్న వారిని ఎదురుగా పొగిడినా వెనకాల విమర్శించే వారే ఎక్కువగా ఉంటారు.

**2) భయం:-** ఈ ప్రాపంచిక ధనం ఉన్నవాళ్లకి ఇంట్లో ధనం వుంటే, దొంగలు వచ్చి పట్టుకెళ్తారనే భయం, బ్యాంకులో పెడితే బ్యాంకు దివాళా తీస్తే నా పరిస్థితి ఏమిటి? అనే భయం ఉంటుంది. అలాగే పది మందితో చనువుగా ఉన్నా, స్నేహంగా మాట్లాడినా అప్పు అడుగుతారేమో అని భయం, ఇలా రకరకాల భయాలతో ఉంటూ ఉంటారు. ఈ భయాలతో వీళ్ళకి సరైన నిద్ర కూడా పట్టదు.

**3) స్వార్థం :-** మితిమీరిన అహం, మితిమీరిన భయం స్వార్థానికి కారణం అవుతాయి. ఆ డబ్బు పెరిగే కొద్ది నా వాళ్లే సుఖపడాలి, నా భార్యా, పిల్లలే సుఖపడాలి, నేనే గొప్పగా జీవించాలి, అంతా నాకే కావాలి అనే స్వార్థం బాగా పెరుగుతుంది.

**4) అత్యాశ:-** చాలామంది డబ్బు పెరుగుతూ ఉంటే తృప్తి ఉండదు. ఎంత వచ్చినా అసంతృప్తితో ఉంటారు. ఈ సంవత్సరం ఇంత లాభం వచ్చింది, ఇంకొంచెం కృషి చేస్తే ఇంకా లాభం వస్తుందని ప్రయత్నిస్తారు. ఆ అసంతృప్తే అత్యాశగా మారిపోతూ ఉంటుంది.

ఇంకా ఇంకా ప్రయత్నిస్తూ చిట్ట చివరికి వార్ధక్యంలోకి వచ్చేటప్పటికి ఇంత కష్టపడ్డాను, ఇంత శ్రమపడ్డాను మరి నన్ను ఎవరూ పట్టించుకోవట్లేదు అని వాళ్ళని వాళ్లే కించపరుచుకుంటూ.. నన్ను ఎవ్వరూ లెక్క చేయట్లేదు, నేను ఎవ్వరికీ పనికి రావట్లేదు అని బాధపడతారు. అంటే వెరసి ఈ ప్రాపంచిక ధనం దుఃఖాన్నే తీసుకు వస్తుంది.

ఈ ధనం అన్నది చేసిన పుణ్యం ఉన్నన్నాళ్ళు ఉంటుంది, పుణ్యం ఖర్చు కాగానే ఇంకొకళ్ళ చేతికి వెళ్ళిపోతుంది. అప్పుడు దుఃఖం వస్తుంది. అంతేకాదు ఈ ధనం తరిగి పోతున్నప్పుడు కూడా దుఃఖం కలుగుతుంది, అంటే ప్రాపంచిక ధనానికి చంచల స్థితి ఉంటుంది. అంటే ఈరోజు డబ్బు ఉండొచ్చు, రేపు పోగొట్టుకోనూవచ్చు. ఉన్నప్పుడు అహంకారం, పోయినప్పుడు దుఃఖం వుంటుంది.

ఆ లక్ష్మీదేవిని అంటే ఉన్న డబ్బుని సత్కార్యాలకు ఉపయోగించకుండా, ధర్మ కార్యాలకు ఉపయోగించకుండా వేరే విధంగా ఖర్చు పెట్టడం వల్ల అంటే పందాల్లో పెట్టడం, రాజకీయాల్లో పెట్టడం లాంటివి చేస్తూ ఉంటారు. అలా ఈ పందాలు వేసి పోగొట్టుకుని దుఃఖపడిన వాళ్ళు ఎంతోమంది ఉన్నారు.

అంటే ప్రాపంచిక ధనం ఎంత సంపాదించినా, పుట్టుకతోనే ఆ సంపదలు వచ్చినా కూడా, సద్వినియోగం చేసుకోకుండా దుర్వినియోగం, నిర్వినియోగం చేస్తే దాని వల్ల కూడా దుఃఖం వస్తుంది.

ఈ ధనం అన్నది ఈ జన్మలోనూ రావచ్చు, ఈ జన్మలోనే పోవచ్చు కూడా. అందుకే మహాత్ములు ఏం చెప్తారంటే? ఉన్నదానితో తృప్తిగా జీవించగలిగితే దుఃఖం ఉండదు అంటారు. అంటే పుట్టినప్పుడు తల్లిదండ్రులకు ఎంతో కొంత ఆస్తి ఉంటుంది, దానితో తృప్తి పడగలిగితే ప్రాపంచిక జీవితంలో కూడా దుఃఖం ఉండదు.

ప్రాపంచిక జీవితంలో ఆ ధనం వల్ల దుఃఖం ఎప్పుడు వస్తుందంటే? అహంకారం పెంచుకున్నప్పుడు, స్వార్థం పెరిగినప్పుడు, అత్యాశ పెరిగినప్పుడు,

ఆ ధనం వల్ల దుఃఖం వస్తూ ఉంటుంది.

గమనిస్తే ఎంత సంపాదించినా ఈ ధనం ఈ జన్మకే పరిమితం కానీ మరణించేటప్పుడు వీసమెత్తు కూడా రాదు. గమనించండి ఈ ధనం, సంపదలు మరణించాక ఉపయోగపడవు. మరి ఇంకా ఇంకా అని ఆశ పడుతున్నారంటే వాళ్ళకి భగవంతుడు అర్థం కాలేదు, భగవంతుడి తత్వం అర్థం కాలేదు అని అర్థం చేసుకోవచ్చు.

భగవంతుడు నీకు ఇవ్వాల్సింది ఇచ్చాడు, కానీ నీవు ఇంకా ఆశ పడ్డావు అంటే ప్రక్కవాడిది నీకు కావలి. కానీ భగవంతుడు ఇవ్వడు. ఇది అర్థమైన జ్ఞాని వున్న దానితో తృప్తి పడతాడు. ప్రాపంచిక ధనం పెంచుకోవాలని ఆశపడడు. పత్రి గారు "ఇస్తే వస్తుంది" అని చెప్తారు. నువ్వు ఏమీ ఇవ్వకుండా ఏదీ రాదు, అంటే ఇక్కడ ఇవ్వడంలోనే వచ్చేది వుంటుంది.

అంటే ఒక జ్ఞానికి డబ్బు లేదు, తినడానికి లేదు, చదువుకోవడానికి పుస్తకాలు లేవు. అలాంటి వాళ్ళకి అన్నం పెట్టు, పుస్తకాలు అందించు, అదే ఆధ్యాత్మిక సేవ. అంటే వాడు ఆధ్యాత్మికంగా ఉన్నతంగా ఎదగడానికి నీ వంతు సేవ నువ్వు చేస్తున్నావు కాబట్టి, ధర్మ కార్యం కాబట్టి, నువ్వు ఇచ్చే కొద్దీ వస్తూ ఉంటుంది. ఆధ్యాత్మిక సేవ అంటే భగవంతుని చేరుకునే ప్రయత్నంలో ఉన్నవాడికి చేయూతను అందించడమే ఆధ్యాత్మిక సేవ.

ఇది ప్రాపంచికంలో ఉంటూ కూడా చేయాలి. నాకు ఇంత ధనం ఉందని అహంకరించిన వాడిని ఆ ధనం వదిలి వెళ్ళిపోతుందట. అలాగే ధనాన్ని సద్వినియోగం చేయకుండా దుర్వినియోగం చేస్తే ఛీ నన్ను ధర్మ కార్యాలకు ఉపయోగించట్లేదు అని వాడిని కూడా ధనం వదిలి వెళ్ళిపోతుందట. మరి మనకి పంచమహా పాపాల్లో జూదం కూడా చెప్పారు కదా? మరి వ్యసనాలకి ఉపయోగించినా వాడి దగ్గర ధనం ఉండదట.

అందుకే ఎంత ధనం వచ్చినా అది భగవంతుడి ప్రసాదం, నా పుణ్యకర్మల వల్ల నాకు వచ్చింది, నేను ధర్మ కార్యాలకు వినియోగించినప్పుడు

భగవంతుడు మెప్పు నాకు ఉంటుంది అని అర్థం చేసుకున్నప్పుడు నువ్వు ఎంత అనుభవించినా కొంత మంచి కార్యాలకు ఉపయోగించినప్పుడు లక్ష్మీదేవి సంతోషపడి నీ దగ్గర ఉంటుంది.

అందుచేత ఎంత ధనం ఉన్నా, కోట్లకు అధిపతి అయినా, నీ ఆయుష్షుని ఒక్క క్షణం పెంచుకోలేవు. కాలాన్ని ఒక్క నిమిషం కొనలేవు. కోటీశ్వరుడైనా కాటికి వెళ్ళాక కాలిపోవలసిందే అని తెలుసుకోండి.

ఈ ధనం నాకు ఆయుష్షుని ఇవ్వలేదు, ఈ ధనం కాలాన్ని నాకు అనుగుణంగా మార్చలేదు, మరి అటువంటి ధనాన్ని చూసి నేను ఎందుకు అహంకారం పెంచుకోవాలి అని ప్రతివాడు తెలుసుకోవాలి. అంతేకాదు పూర్వజన్మ పుణ్య కర్మ వల్ల ఈ ధనం వచ్చింది, మరి ఆ జన్మలో అంత చేస్తే ఇంత వస్తే, ఇంకా చేస్తే ఇంకా వస్తుంది కదా? మరి ఈ ఆలోచన ఎందుకు రాదు? అంటే బుద్ధి, మనసు ప్రపంచం వైపు త్రిప్పి ఉన్నంతసేపు అహంకారం ఉంటుంది, స్వార్థం ఉంటుంది, అత్యాస ఉంటుంది.

భగవంతుణ్ణి కోరుకుంటున్నారు, భగవంతుని చేరుకోవడానికి ఎన్నో అవకాశాలు వుంటాయి. కానీ, ప్రాపంచిక ధనవ్యామోహం వల్ల వచ్చిన ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకోలేకపోతున్నారు. ఇప్పుడు కలియుగంలో ఎలా ఉందంటే? అనారోగ్యం వచ్చినప్పుడు టాబ్లెట్లు వేసుకుంటున్నట్టు, ధ్యానాన్ని కూడా ఉపయోగిస్తున్నారు. కష్టం వస్తే గుడికెళ్లి కొబ్బరికాయ కొట్టి, మొక్కులు మొక్కి, కష్టాలు తీర్చు అన్నట్టు.

అలా ధ్యానంలో కూర్చుని సంకల్పం పెట్టుకుంటున్నారు. కష్టం వచ్చినా సంకల్పం పెడతారు. ఎవరికి పెడతావు? భగవంతుడికి, అంటే భగవంతుడిని కూడా డిమాండ్ చేస్తున్నావు. ఎంత అల్పమైన బుద్ధో చూడండి! ఎంతటి అజ్ఞానంలో ఉన్నారో చూడండి!

భూమి మీదకి వచ్చేటప్పుడు ఏమీ తీసుకురారు, వెళ్లేటప్పుడు ఏమీ తీసుకెళ్ళరు అని ప్రతీ ఒక్కరి మరణం పాఠం చెప్తోంది. అయినా నాది అనే

అహంకారం, నేను నా పిల్లలు అనుభవించాలనే స్వార్థం, ప్రక్కవాడితో ప్రియంగా మాట్లాడితే నా దగ్గర డబ్బుని చూసి మాట్లాడుతున్నాడు అనే ఒక అనుమానం, ఎక్కువ చనువు ఇస్తే నన్ను అప్పు అడుగుతాడేమో అని భయం, ఉన్నది చాలదు ఇంకా సంపాదించాలి అని అత్యాస. మరి ఇలాంటి అత్యాశతో రాత్రీ పగలు కష్టపడుతూ అనారోగ్యాల పాలవుతున్నారు.

ప్రతి ఒక్కరు జీవితంలో సుఖం లేదు, సుఖం లేదు అంటున్నారు కానీ సుఖపడే మార్గాలు ఉన్నా, సుఖపడ్డవారు కళ్ళ ముందు ఉన్నా గుర్తించకుండా ఉన్నారు. కళ్ళకి అజ్ఞానం అనే పొరలు కమ్మి, మనసుకి స్వార్థం, అరిషడ్ వర్గాలు అనే మురికిని పేర్చుకుంటూ సత్యాన్ని దర్శించ లేకపోతున్నారు.

భగవంతుడి సృష్టి లోనివి కోరిన వాళ్ళు డబ్బు వెనకాల పరిగెడతారు. భగవంతుని కోరుకున్న వాళ్ళు ఆధ్యాత్మిక జీవితంలోకి వస్తారు అని కృష్ణ భగవానుడు ఎప్పుడో భగవద్గీత ద్వారా చెప్పాడు. ఎవరు ఏది చేసుకుంటారో వాళ్ళకి అది నేను ఇస్తాను కానీ, నన్ను కోరుకోని వాళ్లే నాకు ఇష్టులు అన్నాడు.

మన ఇంటికి చాలామంది వస్తారు. ఇష్టమైన వాళ్ళకి ఎంతో ప్రేమగా పెడతాం, ఇష్టం లేని వాడు వస్తే మనస్ఫూర్తిగా పెట్టం. కానీ భగవంతుడు కొబ్బరికాయ కొట్టినా, గుడికి వెళ్ళినా, నువ్వు ఎక్కడ ప్రార్థన చేసినా నీ అర్హతను బట్టి నీకు ఇస్తూ ఉంటాడు. కానీ, కోరుకునే వాడికి ఇవ్వడు.

అందుకే ప్రాపంచిక ధనం చంచలమైనది. ఈవేళ ఉంటుంది రేపు ఉండకపోవచ్చు. ఈ ప్రాపంచిక ధనం నీ కూడా రాదు, ప్రాపంచిక ధనం నిన్ను అహంకారంలోకి, అజ్ఞానంలోకి త్రోయడానికి ఒక కారణం అవుతుంది. అందుకే ధనం ఉన్నా ఇది భగవంతుడి ప్రసాదమే అని భావిస్తూ కొన్ని పుణ్య కార్యాలు, ధర్మ కార్యాలు చెయ్యాలి.

ఇక్కడ పుణ్య కార్యాలు అంటే పుణ్యం వస్తుందని చేయడం, ధర్మ కార్యాలు అంటే తన ముందు అవసరం ఉన్న దానికి, అవకాశం ఉన్నదానికి తన డబ్బు ఖర్చు పెట్టడం. ఇప్పుడు ఒక స్కూల్ కట్టించాలి, ఒక పిరమిడ్

కట్టించాలి ఇవ్వండి; అలాగే జ్ఞానులకు అన్నం పెట్టండి, లేదు మన ఇంటికి వచ్చి ధ్యానం చేసుకుంటాం అని ఎప్పుడైనా అడిగితే వాడికి అన్నం పెట్టండి, ఇలా ప్రజలకి ఉపయోగపడే ప్రతీ కార్యము ధర్మ కార్యం అవుతుంది. అలాంటి వారికి వచ్చే జన్మలో భోగవంతమైన జీవితం వస్తుంది.

ఈ ధర్మ కార్యాలు అంటే సత్య కర్మలు. అంటే ఏ స్వార్థం లేకుండా, ఏ కోరిక లేకుండా భగవంతుడు నాకు ఇచ్చాడు కాబట్టి, ఈ ప్రాపంచిక ధనం ఎవరికి అవసరమో వాళ్ళని ఆయనే నా ముందుకు తీసుకొస్తాడు. నేను చేయగలననే నా ముందు పెట్టాడు, నేను చేయాలి అని, ఫలితం పరమాత్మకు అర్పించి, ఈ పని చేయడానికి భగవంతుడికి నేను ఒక సర్వెంటుని అనుకుంటూ నువ్వు చేయగలిగిన రోజున అది ధర్మ కార్యమవుతుంది. మరి ఆ ధర్మమే భగవంతుడికి ఇష్టం.

అందుకే ప్రాపంచికంగా ఉన్నదానితో తృప్తిగా జీవించాలి. ఎప్పుడైతే మనకి తృప్తి లేదో అసంతృప్తి ఉందో దాని వెనకాల అహంకారం, స్వార్థం, అత్యాశ, భయం వస్తుంది. ఎదుటి వాళ్ళని హేళన చేసే గుణం కూడా వస్తుంది. మరి వీడు మనకు సరిపోడు అని తక్కువ వాళ్ళతో మాట్లాడరు.

సొంతవాళ్లే అయినా దగ్గరికి రానివ్వరు వాళ్ళతో ఫోటో తీయించు కోరు, వాళ్ళు నా చుట్టాలు అని చెప్పుకోవడానికి నామోషి, ఇది ప్రాపంచిక జీవితం. ఈ కలియుగంలో పరమ అజ్ఞానంతో ఇట్లాగే ఉంటారు వీళ్ళు. ఎందుకంటే వీళ్ళకి తెలియదు. నాకు డబ్బు ఉంది అనే ఒక్క విషయం తప్పించి. ఈ జన్మలో డబ్బు ఉండడానికి కారణం గత జన్మ పుణ్యం. ఈ జన్మలో నువ్వు చేసుకునే దాన్ని బట్టే మరుజన్మ లేదా భవిష్యత్తు ఉంటుంది అనే చిన్న పరమ సత్యం తెలియని అజ్ఞానులందరూ కూడా ఈ జన్మలో నాకు డబ్బు ఉంది అని అహం పెంచుకుంటారు.

అహం ఎంతగా పెరుగుతూ వుంటుందో వాళ్ళకి అజ్ఞానం కూడా అంతగా పెరుగుతుంది. అందుకే ఉపనిషత్తులు చెప్తూ ఉంటాయి అహంకారికి

ఆత్మజ్ఞానం అబ్బదు అని. ఎందుకంటే? అజ్ఞానం నుంచి ప్రతివాడు జ్ఞానంలోకి రావచ్చు. కానీ మధ్యలో అహం అనే తెర ఉంటే ఎంత చెప్పినా చెవిటి వాడిలా ఉంటాడు తప్పించి వినగలిగే అంత శక్తి వాడికి ఉండదు. వినకపోతే వాడికది మనసులోకి వెళ్ళదు, చెప్పినా అర్థం కాదు.

అందుకే ఎంత చెప్పినా చాలామంది వినరు. వాళ్ళకున్న అహంకారం వల్ల నేనే గొప్ప అని ఈ ఆధ్యాత్మిక మార్గంలోకి రారు. ఇంకా కొంతమంది మా గురువే గొప్ప అని రకరకాల అహంకారాలతో ఉంటారు. అలాంటి వాళ్ళని చూసి అయ్యో వీడికి సరైన ఆత్మజ్ఞానం లేదు అని జాలి పడాలి.

ఈ సృష్టిలో అందరూ భగవంతుడి బిడ్డలే అని ఏనాడు తెలుసు కుంటావో ఆ రోజున నువ్వు ఆత్మజ్ఞానం అనే సంపదను సంపాదించగలవు. అలాగే ప్రాపంచిక ధనమే గొప్పది అనుకుంటూ, నేను బాగా సంపాదిస్తున్నానని అహంకారం పెంచుకోకుండా నాకున్న ధనాన్ని సద్వినియోగం చేస్తున్నానా? దుర్వినియోగం చేస్తున్నానా? నిర్వినియోగం చేస్తున్నానా? అని విచారణ చేసుకోవాలి.

**“ధర్మపరంగా నువ్వు జీవించగలిగితే సద్వినియోగం చేస్తావు. అధర్మ పరంగా జీవిస్తే దుర్వినియోగం అవుతుంది”.** ఏమీ లేకుండా నాకు వచ్చింది కదా! నేను ఊరికే తినేస్తాను అంటే నిర్వినియోగం అవుతుంది. లక్ష్మీదేవి నీ దగ్గరికి వచ్చిందంటే కరెక్ట్ గా ఉంచుకోవాలి. మరి ప్రాపంచిక సంపదలు వచ్చాయని అహంకారం వద్దు, ప్రాపంచిక చదువులు ఉన్నాయని అహంకారం వద్దు, నన్ను చూసి అందరూ గుర్తిస్తున్నారు, నాకు పదవులు ఉన్నాయి అని అనుకోవద్దు.

ప్రాపంచిక సంపదలు ఎన్ని ఉన్నా అహంకారం పెంచుకోకుండా ధర్మపరమైన జీవితం జీవించగలిగితే అప్పుడు ఆధ్యాత్మిక సంపద పొందే అర్హత సంపాదించుకుంటారు.

అహంకారాన్ని వదులుకున్నవాడు భగవంతుడి పరీక్షలకు తట్టుకుని

ముందుకు వెళ్లి ఆధ్యాత్మిక సంపదను సంపాదించుకుంటాడు. అందుకే పునాది ప్రాపంచిక ధనమే అయినా ఎన్ని అంతస్తులైనా ఎదగాల్సింది ఆధ్యాత్మిక సంపదతోనే.

ప్రపంచంలో వున్నాము అంటే ఇక్కడ నేర్చుకోవలసినవి వున్నాయి, ఎదుటివాడికి నేర్పవలసినవి ఉన్నాయి. అందుకే పుట్టుకతో అజ్ఞానంతో ఉన్నా ఒక గురువు వచ్చాక జ్ఞానిగా ఎదిగితే మీ జీవితంలో ఇంద్రియాల ద్వారా సంపాదించుకున్న జ్ఞానాన్ని అందరికీ పంచినప్పుడు అది సద్వినియోగం అవుతూ ఉంటుంది.

ఈరోజు ప్రాపంచిక ధనం ఎంత ఉన్నా ఈ జన్మకే పరిమితం, మరుజన్మకి రాదు. ఈ సంపదలు భూమిమీద సంతోషంగా బ్రతకడానికే ఉపయోగపడతాయి. అందుకే మహాత్ములందరూ ఉన్నదానితో తృప్తిగా జీవించండి అన్నారు.

నీ కూడా రాని డబ్బు కోసం పరుగులు ఎందుకు? అత్యాస ఎందుకు? స్వార్థం ఎందుకు? అహంకారం ఎందుకు? అవన్నీ వదులు. నీ కూడా రాని వాటిని చూసుకుని ఇంత అహంకారం పెంచుకోవడం తగదు అని మనకి గురువులు, మహాత్ములు చెప్తూ ఉంటారు. అందుకే ప్రాపంచిక సంపద తొలిమెట్టు అయితే, ఆధ్యాత్మిక సంపద చివరి మెట్టు.

## "ఆధ్యాత్మిక ధనం"

ప్రాపంచిక ధనం లేదా సంపద ఎంత పెరిగితే అన్ని సుఖాలూ, భోగాలూ అమర్చుకోవచ్చు. కానీ ప్రాపంచిక సంపదల కంటే కూడా అత్యున్నత స్థాయికి తీసుకువెళ్లేది ఆధ్యాత్మిక సంపదే.

ప్రాపంచిక భోగాలు, సంపదలు ఎన్ని ఉన్నా మనిషిలో దుఃఖం పోదు. కాని ఆధ్యాత్మిక సంపద ఉన్న వారికి దుఃఖం ఉన్నా అది దుఃఖంలా అనిపించదు. ప్రపంచంలో మూడు వంతుల జనానికి ప్రాపంచిక సంపదలే తెలుసు కాని ఆధ్యాత్మిక సంపదల గురించి తెలియదు. మరి ఈ ఆధ్యాత్మిక

సంపద అంటే ఏమిటి? అన్నది తెలుసుకుందాం.

ప్రాపంచిక సంపదలే గొప్ప అనుకునే నేటి రోజుల్లో అంతకంటే గొప్ప సంపద ఆధ్యాత్మిక సంపద అని పత్రీజీ తెలియచేసారు. ప్రాపంచిక సంపదలతో ఈ భూమిమీద ఉన్నవన్నీ అమర్చుకోవచ్చు. కానీ పరలోకానికి తీసుకు వెళ్లే సంపదే ఈ ఆధ్యాత్మిక సంపద. అంటే మీరు ఎంతగా ధ్యానం చేస్తారో! ఎంతగా జ్ఞానం పొందుతారో! దాన్ని బట్టే మీ పరలోక ప్రయాణం సుఖంగా సాగుతూ ఉంటుంది.

భూమిమీద ఎంత ధనం ఉన్నా సత్యలోకానికి వెళ్ళాలి అంటే వెళ్ళలేరు. కానీ ఆధ్యాత్మిక సంపద ఉన్న ప్రతి ఒక్కరు సత్యలోకానికి, మోక్షానికి వెళ్ళడానికి అర్హులవుతారు. కటిక పేదవాడైనా ఆధ్యాత్మిక సంపద ఉంటే పైలోకాలకి చేరుకోవచ్చు.

అందుకే ఎన్నో జన్మల్లో భూమి మీద అనుభవించవలసినవన్నీ అనుభవించి, నేర్చుకోవలసినవన్నీ నేర్చుకున్నాక, ఆధ్యాత్మిక సంపద సంపాదించ డానికి అర్హత వచ్చినప్పుడు, మీ జీవితంలోకి సద్గురువులు వస్తారు, వారు చెప్పిన మాటలు అర్థమవుతాయి, ధ్యానంలోకి వస్తారు.

అందుచేత ధ్యానం చేయడంలో కానీ, జ్ఞానం పొందడంలో కానీ ఎప్పుడూ శ్రద్ధ, తపన, ఆసక్తి వుండాలి. 'శ్రద్ధవాన్ లభతే జ్ఞానం' అని కృష్ణ భగవానుడు గీతలో చెప్పాడు. అశ్రద్ధని జీవితంలోకి రానివ్వకూడదు, అశ్రద్ధతో ఒక్కరోజు ధ్యానం వదిలారంటే వెంటనే బద్ధకం, మరుపు వస్తూ ఉంటాయి. ఏదైనా ధ్యానం చేస్తేనే ఆధ్యాత్మిక సంపదని పొందగలరు.

గమనిస్తే ప్రతి ఒక్కరు ప్రాపంచిక సంపదలు పొందడానికి ఎన్నో చేస్తారు. కానీ, ఈ ఆధ్యాత్మిక సంపద పొందడానికి మాత్రం చాలా కొద్దిమందే తీవ్రాతి తీవ్రమైన కృషి చేస్తూ ఉంటారు. మరి ఇక్కడ వదిలి వెళ్లే ప్రాపంచిక ధనం కోసమే ఇంత కష్టపడుతుంటే, కూడా వచ్చే ఈ ఆధ్యాత్మిక సంపద కోసం ఎంత కష్టపడాలో ఆలోచించండి! అందుచేత ఏడు లోకాలలో పైకి

వెళ్ళగలిగే స్థితి కలిగించే ఈ ఆధ్యాత్మిక సంపద పొందేటప్పుడు అశ్రద్ధ, బద్ధకం ఉండకూడదు. అశ్రద్ధ వుంటే మళ్ళీ తల్లి గర్భంలో బిడ్డగా జన్మ తీసుకోవాలి.

భాగవతంలో **“నీ ప్రారబ్ధంలో ఉన్నది వీధిలో పడేసినా నీ ఇంట్లోకి వస్తుంది, నీ ప్రారబ్ధంలో లేనిది ఎంత దాచినా నీ చేతుల్లో నుంచి వెళ్ళిపోతుంది అని చెప్పబడింది”.** దానికి నీకు ఇంత తపన ఎందుకు? పరమాత్మను చేరుకోవడానికి ప్రయత్నం చేయాలి కానీ ప్రాపంచిక సంపదల కోసం అంత కష్టపడాల్సిన అవసరం లేదు అని యమధర్మరాజు చెప్పడం జరిగింది.

మరి ఈ ఆధ్యాత్మిక సంపద అనేది ఎవరికి వాళ్ళు స్వయంగా సంపాదించుకోవాలి. ఎవరు ధ్యాన సాధన చేస్తారో వాళ్ళకే జ్ఞానం అనే సంపద వస్తుంది. వంశ పారంపర్యంగా కానీ, తల్లిదండ్రుల వల్ల కానీ, చుట్టాలు, బంధువుల వల్ల కానీ, గ్రామం వల్ల, దేశం వల్ల కానీ, ఎవరికీ కూడా ఈ ఆధ్యాత్మిక సంపద అంటే జ్ఞానం రాదు. ఇది ఎంతమందికి ఇచ్చినా, ఎంతమందికి పంచి పెట్టినా మీ ఖజానా ఎప్పుడూ ఖాళీ అవ్వదు.

మరి అటువంటి అద్భుత సంపద ఎంతగా పెరుగుతుంటే మానవుడు అంత వినయంగా ఉండగలుగుతాడు. ప్రకృతి పట్ల, పరమాత్మ పట్ల, గురువు పట్ల ఎంత వినయంగా ఉంటారో అంత గొప్పగా ఎదిగి ఇంకా జ్ఞానవంతులు అవుతారు. అహంకారం లేని వాడిని గమనిస్తే వాడు ఎంత జ్ఞానం పొందు తున్నాడో అర్థమవుతూ ఉంటుంది.

అందుకే **‘అన్నీ వున్న ఆకు అణిగిమణిగి ఉంటుంది, ఏమీ లేని ఆకు ఎగిరెగిరి పడుతుంది’** అని అంటారు. అలాగే అనంతమైన జ్ఞానం పొందే సాధకుడు వినయంగా ఉంటాడు. కొంచెం తెలిసినవాడు నాకు ఎంతో తెలుసని అహంకారంతో ఉంటాడు.

ఆధ్యాత్మిక సంపద ఉన్నవాడు అది అందరికీ పంచి పెట్టాలి. సృష్టిలో సకల జీవుల మీద ప్రేమ, దయ, కరుణ చూపిస్తూ అందరిని తనతో సమానంగా చూసుకుంటూ ఉండాలి. ఈ ఆధ్యాత్మిక సంపద మిత్రత్వాన్ని నేర్పుతుంది, భగవంతుడికి నచ్చే గుణాలన్నీ ఆధ్యాత్మిక సంపదతో ఉన్నవారికి ఉంటాయి,

త్యాగం వీరి సహజ గుణం అవుతుంది, వీరికి స్వార్థం ఉండదు. అందుకే దైవాన్ని పూజించవలసిన, దైవానికి ఇష్టమైన పుష్పాలను ఈ విధంగా చెప్పడం జరిగింది.

**అహింసా ప్రథమం పుష్పం, పుష్పమింద్రియ నిగ్రహం,**
**సర్వభూత దయా పుష్పం, క్షమా పుష్పం విశేషతః,**
**శాంతి పుష్పం, తపఃపుష్పం, ధ్యాన పుష్పం,**
**తథైవచ సత్యమష్టవిధం పుష్పం విష్ణోః ప్రీతికరం భవేత్။**

ఇన్ని రకాలుగా గురువు దగ్గర నేర్చుకున్నాక ఆధ్యాత్మిక సంపద పెరుగుతున్నప్పుడు అశుద్ధంగా ఉన్న మనసు ఆత్మ వైపు తిరిగి శుద్ధి అవుతుంది. అలా శుద్ధి అయినప్పుడు ఇవన్నీ సహజ గుణాలు అవుతాయి, స్వార్థం నిస్వార్థంగా మారుతూ ఉంటుంది, క్రోధం కరుణగా మారుతుంది, ద్వేషం మిత్రత్వంగా మారుతుంది, అహంకారం వినయంగా మారుతుంది.

చూడండి ప్రాపంచిక జీవితంలో అక్కర్లేనివి ఎన్నో వస్తాయి! కాని ఆధ్యాత్మిక జీవితంలో అక్కర్లేనివి పోయి మంచి గుణాలు వస్తాయి. సహజంగా మానవుడు ఆనంద స్వరూపుడైనా, తానే దైవమై ఉన్నా మనసు ప్రపంచం వైపు తిరిగితే అక్కర్లేని బురదంతా పోసుకోవడం వల్ల, ప్రపంచం బాగోలేదు అనుకుంటాడు. చూడండి కళ్ళకి రంగు కళ్ళద్దాలు పెట్టుకొని ప్రపంచం ఈ రంగులో ఉందేంటి అన్నట్టుగా ఉంటుంది.

ప్రపంచంలో స్వార్థం ఉంది, ద్వేషం ఉంది ఏమి బాగోలేదంటారు. కానీ మీలో గుణాలు మారినప్పుడు, దైవీ లక్షణాలన్నీ వచ్చినప్పుడు, దైవంగా ఎదుగుతున్నప్పుడు అందరూ మంచివాళ్ళలాగే కనిపిస్తారు.

ఈ విధంగా ఎప్పుడూ కూడా సాధన చేస్తూ ఆధ్యాత్మిక ధనం సంపాదించినప్పుడు ఎప్పుడు ఇవ్వడానికే చూస్తారు, అదే త్యాగబుద్ధి. ఎందుకంటే ఈ సంపద వచ్చినప్పుడు జ్ఞాని తెలుసుకుంటాడు, **'నేను పుట్టుకతో ఏది తీసుకు రాలేదు, వెళ్తున్నప్పుడు పట్టికెళ్లేది ఈ జ్ఞాన ధనం ఒక్కటే అని'.**

మరి ఈ ఆధ్యాత్మిక సంపద పది మందికీ ఇస్తే వాళ్ళకు కూడా

ఆధ్యాత్మిక సంపద సంపాదించుకోవడానికి అర్హత వస్తుంది అని ఒక యోగికి తెలుసు కాబట్టి తన దగ్గర ఉన్న జ్ఞాన సంపదని పంచిపెట్టడానికి ఎప్పుడు ఉవ్విళ్ళూరుతూ ఉంటాడు.

ఎందుకంటే ఒక యోగి తాను బాగుపడటమే కాదు, తాను ఆనంద పడటమే కాదు, అందరూ ఆనందంగా జీవించాలని కోరుకుంటాడు. ప్రాపంచికంలో అవుతే తానే సుఖపడాలని అనుకుంటాడు, కాని ఆధ్యాత్మిక ధనం వచ్చేటప్పటికి తనతో పాటు అందరూ బాగుండాలని కోరుకుంటాడు.

అలా బుద్ధుడు కానీ, శంకరాచార్యులు కానీ, పత్రిగారు కానీ... ఇలా ఎందరో మహానుభావులు భూమిమీద ఈ ధ్యానాన్ని విస్తరింపచేసారంటే! వాళ్ళ కోరిక అందరూ ఆధ్యాత్మిక సంపద సంపాదించుకొని, సత్యమే తన స్వరూపం అని తెలుసుకుని, సత్యలోకవాసులు కావాలనే.

గురువులు విత్తనాలు ఇస్తారు, కాని దాన్ని గొప్ప పంటగా మార్చుకునేది సాధకుడే. ఎంత శ్రద్ధగా సాధన చేస్తారో, ఎంత తీవ్రాతి తీవ్రంగా తపన పడుతూ ఉంటారో అంత ఆధ్యాత్మిక సంపద పెరుగుతుంది.

అందుకే గీతలో కృష్ణ భగవానుడు

**శ్లో॥ మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే ।**
**యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః ॥ (భ.గీ. 7-3)**

అంటే లోకంలో కోట్ల మంది ఉన్నా అందరూ ఆత్మ తత్వాన్ని తెలుసుకోలేరు, కొందరే తెలుసుకోగలరు అన్నారు. అందుకే ఆ సంపద పొందినవాడు నిత్యమూ ఆనందంగా జీవిస్తాడు. ఎందుకంటే తనలో ఉన్న ఆనందాన్ని తాను మాత్రమే అనుభవించగలడు, తనకి మాత్రమే తెలుసు. అందుకే **"కౌపీనవంతం కడుభాగ్యవంతం"** అన్నారు. అంటే కౌపీనాన్ని కట్టుకున్న యోగి కడు భాగ్యవంతుడట.

అంటే గోచి కట్టుకునే వాడు అందరికంటే భాగ్యవంతుడట. కారణం వాడు ఎప్పుడూ ఆత్మానందం అనుభవిస్తూ వుంటాడు, ఎందుకంటే అంత ఆధ్యాత్మిక సంపద వాడి దగ్గర ఉంది. చూడండి రమణ మహర్షి ఏ ఆభరణాలు

వేసుకున్నాడు? ఏ పట్టు వస్త్రాలు ధరించాడు? మేడలు, కార్లు ఏమున్నాయి? అయినా ఎప్పుడు ఆనంద స్థితిలో ఉండేవాడు. ఆయన ఆనందాన్ని తన సహజ గుణం చేసుకున్నాడు.

అందుకే అవనిలో ఆధ్యాత్మిక సంపద ఉన్నవాడంత ఆనంద స్వరూపుడు ఎవరూ ఉండరు. మరి ఈ ఆధ్యాత్మిక సంపద అందరూ సంపాదించుకోవాలనే గురువుల తపన. ఎందుకంటే ప్రాపంచిక సంపదల్లో దుఃఖం ఎక్కువ, సంతోషం తక్కువ. ఆధ్యాత్మిక సంపద పొందినవాడు ఎప్పుడు ఆనంద స్థితిలో ఉంటాడు.

కానీ ఇప్పుడు భూమ్మీద ఆధ్యాత్మిక సంపద కోసం ప్రయత్నించినా, పాడు చేసేవాళ్ళు ఎంతో మంది ఉన్నారు. అందుకే ఒక మహాకవి అన్నాడు. **"లోక రక్షక యోగి కోటికొక్కడురా, లోక భక్షక యోగి మనిషికొక్కడురా"** అని.

అంటే లోకాన్ని రక్షించేవాడు కోటికి ఒక్కడు పుడతాడట. లోక భక్షక యోగి అంటే లోకాన్ని నాశనం చేసేవాడు ప్రతి మనిషి ప్రక్కన ఇంకొకడు ఉంటాడట. వాడేదో యోగ మార్గంలోకి వచ్చి చేస్తే అప్పుడే ఎందుకురా? ఇంకా నీకు ఏం వయసు అయిందని? నీ బాధ్యతలు ఏం తీరాయని? అని ఏదో విధంగా చెడగొడతారు.

కానీ, ఆధ్యాత్మిక సంపద ఉన్నవారికంటే గొప్పవాళ్ళు ఈ భూమ్మీద లేరు అని చెప్పవచ్చు, కానీ అర్హత లేని వాడికి ఇది అర్థం కాదు.

పత్రిగారు ఈ సంపద ఎలా సంపాదించుకోవచ్చో మూడు మాటల్లో చెప్పారు. ఆయన ఏమన్నారంటే "ధ్యానం వల్లనే జ్ఞానం, జ్ఞానం వల్లనే మోక్షం" అని. ఏదైనా ఆధ్యాత్మిక కోటీశ్వరులు అయితేనే సత్యలోకానికి వెళ్లే అర్హత వస్తుంది. మరి ఆధ్యాత్మిక సంపద పెంచుకోవడానికి ఉన్న ఒకే ఒక్క మార్గం "శ్వాస మీద ధ్యాస" ధ్యానం.

గురువు మార్గం ఇచ్చాడు. మరి ఆ మార్గంలో పయనిస్తూ వున్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేర్చే ఆధ్యాత్మిక సంపద ఈ భూమిమీద ఉండగానే సంపాదించుకోవాలి.

# ఏ జంతువుకి లేని మనసు మానవునికే ఎందుకు ఇవ్వబడింది?

అందరూ ప్రాపంచిక విషయాల కోసం అంటే చిన్నతనంలో చదువు కోసం, కొంచెం ఎదిగాక డబ్బు సంపాదించడం కోసం, కోరికలు తీర్చుకోవడం కోసం, బుద్ధిని ఉపయోగించి ఎన్నో పనులు చేసారు, కాని మీ గురించి మీరు ఏ పనులు చేయట్లేదు.

కానీ ఆధ్యాత్మిక జీవితంలోకి అడుగుపెట్టాక 84 లక్షల జీవరాశుల్లో ఎవరికీ లేనటువంటి బుద్ధి అనేది మానవుడికి ఇవ్వబడిందని, బుద్ధి బాగా వికసించిన వాడికే జ్ఞానం వస్తుందని పత్రి గారు కాని, రాఘవరావు గారు కాని ఎన్నో సందర్భాలలో చెప్పడం జరిగింది.

అయితే ఏ జంతువుకి లేని మనసు మానవునికే ఎందుకు ఇవ్వబడింది? అనే విషయాన్ని తెలుసుకుందాం. ఒక్కొక్కసారి జంతువులే నయం చాలా హాయిగా ఉన్నాయి, మనకే ఈ బాధలు, ఈ కష్టాలు అని అనిపిస్తూ ఉంటుంది.

మరి వాటికి లేని బాధలు, వాటికి లేని కష్టాలు, వాటికి లేని రోగాలు, దుఃఖం మానవులకు ఎందుకు ఉన్నాయి? అంటే మానవుడికి మనసు అనేది ఇవ్వబడింది. ఈ మనసుతో ఆలోచించాలి కానీ కొంతమంది అజ్ఞానంతో ఈ మనసుతోటే సమస్యల్ని పెంచుకుంటున్నారు. కానీ ఆ సమస్యలకి పరిష్కారాలు వెతకడానికే మానవుడికి మనసు ఇవ్వబడింది. మానవుడు ఎంతసేపు తనకున్న మనసు యొక్క ఆలోచనను బట్టి, చుట్టూ ఉన్న పరిసరాల్ని, వాతావరణాన్ని, జనాల్ని గమనిస్తూ ఉంటాడు. గమనించి బుద్ధితో విశ్లేషణ చేస్తూ ఉంటాడు. కొన్నిటికి అర్థం తెలుసుకున్నా, కొన్ని అర్థం కాక అభిప్రాయాల్ని తప్పుగా మార్చుకుంటాడు.

మరి జంతువులు ఎందుకు హాయిగా ఉంటున్నాయి? అంటే వాటికి

వుండే సహజ ప్రేరణ వల్ల. అంటే మానవుడికి ఉన్నంత గొప్పగా వాటికి మనసు ఉండదు కాబట్టే వాటికి గడ్డేస్తే గడ్డే తింటాయి, ఒక జంతువుకి ఏది నిర్దేశించబడిందో అవే తింటూ ఉంటాయి. ఆకలివేస్తే తింటున్నాయి, కోరిక కలిగినప్పుడు రమిస్తున్నాయి, తరువాత పిల్లల్ని కంటున్నాయి. కానీ నాకీ కష్టాలు వచ్చాయి, కష్టాలు తీర్చు. రోగాలు వచ్చాయి, రోగాలు తీర్చు, నాకు దుఃఖం ఉంది దుఃఖం పోగొట్టు అని ఏ జంతువూ, ఏ గుడికి వెళ్లి, ఏ దేవుడ్ని ప్రార్థించదు.

కానీ మానవులు అన్నీ వున్నా ఇంకా ఏదో కావాలన్న తపనతో విగ్రహాలకి మొక్కుతూ, గుళ్ళు తిరుగుతూ, ప్రార్థనలు చేస్తూనే ఉన్నారు. ఎందుకు చేస్తున్నారంటే? తనకు ఇంత శక్తి ఉంది అని తెలియక. అంటే బుద్ధిని ఉపయోగించి విశ్లేషణ చేయకపోవడం వల్ల.

మీ చుట్టూ ఎన్నో జరుగుతుంటాయి. అందులో కొన్ని నచ్చినవి వుంటాయి, కొన్ని నచ్చనివి ఉంటాయి. అలా ఉన్నప్పుడు ఏది స్వీకరించాలి? ఏది స్వీకరించకూడదు అనే బుద్ధి లేక సమస్యలకు మూలం వేరే ఎవరో అనుకుంటూ, దుఃఖానికి కారణం వేరే ఎవరో అనుకుంటున్నారు, బాధలకీ కారణం ప్రక్కవాడు అనుకుంటున్నారు. జంతువులులాగా నిశ్చింతగా బ్రతికే అవకాశం లేదనుకుంటున్నారు, కానీ నిశ్చింతగా బ్రతికే అవకాశం కూడా ఉంది.

ఏదైనా కష్టం వస్తే మూలాల్లోకి వెళ్లి కారణం ఏమిటి? అని వెతకగలిగే శక్తి జీవితంలో ఎవ్వరికీ లేదు, అందుకే ప్రక్కవాడి మీద తోసేస్తారు. కొంతమందిని గమనిస్తే ఎంత కష్టపడినా వాళ్ళ చేతిలో డబ్బు ఉండదు. ఎందుకు ఉండదంటే? నేను కష్టపడుతున్నాను, చమటోడుస్తున్నాను, గొడ్డులా చాకిరీ చేస్తున్నాను, ఏదీ కలిసి రావట్లేదు అంటారు. ఎన్నో గుళ్ళకి, తీర్థయాత్రలకి వెళ్తారు, గంటలు గంటలు పూజలు చేస్తారు, ప్రతీ దేవుడికి మొక్కుతారు, కానీ వాళ్ళ కష్టాలు పోవట్లేదు అంటారు, కారణం అజ్ఞానం.

ఈ కష్టానికి కారణం ఏమిటి? అని మనసు, బుద్ధితో కలిపి విచారణ చేస్తే, విశ్లేషణ చేస్తే సత్యం తెలుస్తుంది. కాని మానవుడికి ఈ కలియుగంలో అంతలా ఆలోచించే ఓపిక లేదు. అందుకే భగవంతుడే దయ తలచి అలాంటి వారి దగ్గరికి ఒక సద్గురువుని పంపుతాడు.

గురువు వచ్చాక నీ కష్టాలకి, కన్నీళ్ళకి, రోగాలకి, బాధలకి పరిష్కారం బయట పుణ్యక్షేత్రాలకు వెళ్ళినా, తీర్థయాత్రలకు వెళ్ళినా, బయట ఎక్కడ వెతికినా దొరకదు, బాహ్యంగా తిరుగుతున్న నీ మనసును అంతరంలోకి మళ్ళిస్తేనే నీ దుఃఖానికి పరిష్కారం తెలుస్తుందని చెప్తారు. అప్పుడు ధ్యాన మార్గంలోకి వస్తారు.

ఇక్కడ గమనించండి పశువులు నిశ్చింతగా బ్రతికేస్తున్నాయి అంటే వాటికి రేపటి గురించి ఆలోచన ఉండదు, తన పిల్లలకు దాయాలనే ఆలోచన ఉండదు, వర్తమానంలో జీవిస్తాయి, ఆకలివేస్తే తింటాయి, పెడితే తింటాయి, ఈ గడ్డి రుచిగా లేదని అనవు.

మీకు ఎవరైనా భోజనం పెడితే ఈ కూర బాగాలేదు, ఆ పచ్చడి బాగాలేదు, ఈ సాంబార్ బాగాలేదని 100 సార్లు వాటిని విమర్శించుకుంటూ తింటారు. మరి వాటికి అలాంటి చింత ఉందా? అంటే లేదు. సహజంగా ఆకలి వేస్తే ఏది దొరికితే అది తినాలని తింటున్నాయి. కోరిక కలిగితే కలుస్తున్నాయి, పిల్లల్ని కంటున్నాయి. అంటే వాటికి దేని మీదా ఆసక్తి ఉండదు. ఇదంతా ఆ మనసు అనేది లేకపోవడం వల్లే.

కానీ మీరు ఎవరో తెలుసుకోవడానికి చేసే ప్రయత్నంలో మనసుది చాలా ముఖ్యమైన పాత్ర కాబట్టి మనసు ఇవ్వబడింది. ఆ మనసే లేకపోతే జడపదార్థాలుగా ఉంటారు. చాలామంది మెంటల్లీ రిటార్డెడ్ పిల్లలని చూస్తూ ఉంటారు, వాళ్ళు ఆకలి వేస్తే తింటారు. ఎంత తింటారో వాళ్ళకే తెలియదు, అరగదని వెంటనే తల్లి ఆపుతుంది. వాళ్ళకి మనసు, బుద్ధి రెండు పని చేయక కడుపు నిండి పోయిందని కూడా వాళ్లకి తెలియదు.

మరి మీకు ఉన్న సమస్యలకి, బాహ్యంగా పడుతున్న వేదనలకి ఆలోచించి కారణం ఏమిటో కనుక్కోడానికే ఈ మనసు ఇవ్వబడింది. కానీ కలియుగంలో మానవులకి అంత శక్తి లేకే గురువు యొక్క సహకారం కావల్సి వస్తుంది. కానీ గురువు మనల్ని కష్టాల నుంచి ప్రక్కన పడేయడు, రోగాల నుంచి బయటికి తీసుకురాడు. ఆ కష్టాలూ, రోగాలూ, దుఃఖం ఎలా పోగొట్టుకోగలవో ఆ మార్గాన్ని చెప్తాడు, ప్రయాణం చేయవలసింది శిష్యుడే.

సరియైన మనసు, సరియైన బుద్ధి ఉన్నవాడు గురువు మాటల్ని విని వెంటనే అంతర్ ప్రయాణం చేసి సమస్యల నుంచి, దుఃఖం నుంచి బయట పడతాడు. పత్రిగారు మనకి చెప్పారు **"నీ వాస్తవానికి నువ్వే సృష్టికర్తవి"** అని.

ఆ విషయం తెలియక నేను ఇలా నల్లగా ఎందుకున్నాను? నేను ఇలా లావుగా ఎందుకున్నాను? నేను ఎందుకిలా అనాకారిగా ఉన్నాను? అందగత్తెగా ఎందుకు లేను? దేవుడు నన్ను ఎందుకు ఇలా పుట్టించాడు? నన్ను గొప్ప ఇంట్లో పుట్టించొచ్చు కదా? ఇలాంటి ఇంట్లో ఎందుకు పుట్టించాడు? నేను ఆడదానిగా ఎందుకు పుట్టాను? మగవాడిగా పుట్టించొచ్చు కదా? అని దైవం కనబడదు కాబట్టి, ఏమీ మాట్లాడదు కాబట్టి దైవం మీదకి తోసేస్తారు.

గురువు వచ్చేవరకు దైవం నా జీవితాన్ని మార్చగలడు అని ఒక అభిప్రాయంతో గుళ్ళకు తిరుగుతారు. కానీ గురువు వచ్చాక బుద్ధితో ఆలోచించినప్పుడు మాత్రమే నా ఆలోచనా విధానం తప్పు అని అర్థమై అంతర ప్రయాణం చేస్తారు. తను  ఎందుకిలా ఉన్నాడో, ఎందుకు ఇలాంటి జన్మ తీసుకున్నాడో, తన చుట్టూ ఇన్ని సమస్యలు, బాధలు, కష్టాలు, కన్నీళ్లు ఎందుకున్నాయో అర్థమవుతుంది.

బుద్ధిని వికసింప చేసుకోవాలంటే అంతర్ ప్రయాణం చేయవలసిందే! మనసును ఆత్మ వైపు తిప్పవలసిందే! ప్రపంచం వైపు త్రిప్పినప్పుడు అన్నీ ప్రశ్నలే వుంటాయి, ఆత్మ వైపు త్రిప్పినప్పుడు సమాధానాలు పొందుతారు.

సరైన ధ్యానం "శ్వాస మీద ధ్యాస" చేయకపోతే జీవితమంతా ప్రశ్నల మయమే, ఏదీ అర్థం కాదు.

ఎందుకంటే ధ్యానం ద్వారా ఆ శక్తిని నువ్వు లోనికి పంపిస్తే, నీలో అనంతమైన శక్తి పెరిగిపోతుంది. ఆ గురువు మనసులో ఉన్న సమాధానమే నీ ఆత్మ నీకు చెపుతూ ఉంటుంది. మరి గురువు అవసరం లేదా? అంటే అవసరమే! ఎంతవరకు అంటే? నీ ఆత్మ నుంచి వచ్చే సమాధానాలు తెలుసుకునే వరకు గురువు కావాలి. అంతవరకు గురువే నీకు ఆత్మలా పని చేస్తాడు. అందుచేత జ్ఞానానికి ముందు గురువు అవసరమే.

ఇప్పుడు చూడండి నది దాటే వరకు పడవ అవసరం. నది దాటాక పడవ అవసరం లేదు. అలాగే నీకు ఆత్మ నుంచి సంకేతాలు అందాలి. అలా అందాలంటే నీకు గురువు వచ్చి చెప్తాడు బాహ్యంలోని ఏ ప్రశ్నకి నీకు పూర్ణమైన సమాధానం రాదు, నీ సమస్యలకి పరిష్కారమూ దొరకదు, నీ కర్మల్ని ఆపలేవు. కానీ నువ్వు అంతరంలోకి వెళ్లి ఆత్మ దగ్గరికి ప్రయాణం చేస్తే, ఆత్మశక్తి పెంచుకోగలిగితే ఆత్మ నుంచి సంకేతాలు అందగలిగితే నీ ప్రశ్నలన్నిటికీ లోపల నుంచి సమాధానం వస్తుంది.

చాలామంది గురువు అక్కర్లేదు, గురువు ఇచ్చిన జ్ఞానం, ధ్యానం అక్కర్లేదు అని అజ్ఞానంతో మాట్లాడతారు. గురువు ఎందుకున్నాడు అంటే? నీ జీవితంలో వెలుగు నింపడానికి ఉన్నాడు. నీ తల్లిదండ్రుల నుంచి, బంధువుల నుంచి, కులస్తుల నుంచి ఏ వెలుగూ రాదు.

అజ్ఞానం అనే చీకట్లో ఉన్న నీకు జ్ఞానమనే వెలుగుని ఇచ్చేవాడు గురువు ఒక్కడే. గురువు లేనప్పుడు బాహ్యంలో తిరుగుతావు, నీ జీవితం బాధలమయమవుతుంది, అప్పుడు గురువు అంతర్ ప్రయాణం చేయి అంతులేని ఆనందాన్ని పొందుతావు అని చెప్పినప్పుడు "శ్వాస మీద ధ్యాస" పెడతావు. అప్పుడు నీ ఆత్మ నుంచి వచ్చిన అనంతమైన ఆనందాన్ని నువ్వు పొంద గలుగుతావు.

ఇప్పుడు గమనించండి ఇదే ధ్యానం చేసి అత్యున్నత స్థితికి వెళ్ళిన వాళ్ళు ఏదైతే పొందారో మీరు అదే ధ్యానం చేస్తే ఆ అత్యున్నతమైన ఆనందాన్ని పొందుతారు, అంతరప్రజ్ఞను బయటికి తెచ్చుకుంటారు.

అందుచేత ధ్యానంలో ఎన్ని గంటలు కూర్చున్నారు అన్నది కాదు మనసు ఎంత శూన్యం అవుతుంది? అన్నది చూసుకోవాలి. నేను బాహ్యంలో ఉన్నప్పుడు నా ప్రవర్తన ఎలా ఉంది? నాకు భగవంతుడు మానవజన్మ ఇచ్చాడు, మనసు అనేది ఇచ్చాడు, బుద్ధి అనేది కూడా ఇచ్చాడు. రోజు రోజుకి నేను దైవంగా మారుతున్నానా? లేదా? అన్నది చూసుకోవాలి.

మనసు, బుద్ధితో నేను అంతర్ ప్రయాణం చేసినా నేను భగవంతుని జ్ఞానాన్ని పొందలేకపోతున్నానంటే, నా సాధనలో లోపం ఉంది అని తెలుసు కోవాలి. అంటే ప్రాపంచిక వ్యవహారాల్లో నేను తలదూరుస్తున్నాను, అక్కర్లేనివి కల్పించు కుంటున్నాను. అక్కర్లేనివి పోగేసుకోవడం వల్ల కావలసినవి జారి పోతున్నాయి అని అర్థం చేసుకోవాలి.

ఇప్పుడు గురువుగారు చదవమన్నారు కదా అని ఒక గంట ఒక మంచి పుస్తకం చదువుతారు, ఎంతో జ్ఞానాన్ని సంపాదించుకుంటారు దానిఇని పదే పదే ఒంటరిగా కూర్చుని మననం చేసుకోవాలి. కానీ మిగతా సమయంలో సెల్ చూస్తూ, సీరియల్స్ చూస్తూ చెత్త పోగేసుకోకూడదు. దానివల్ల స్వాధ్యాయం ద్వారా సేకరించింది మీ నుంచి జారిపోతుంది, పొందిన జ్ఞానాన్ని పోగొట్టుకుంటారు.

ఇప్పుడు మీరు సంపాదించిన డబ్బు బ్యాంకులో అయినా దాస్తారు, ఇనప పెట్టెలోనైనా దాస్తారు. అలా దాచింది అవసరమైనప్పుడు తీస్తారు. అలాగే గురువుల ద్వారా కానీ, సజ్జన సాంగత్యం ద్వారా కానీ, స్వాధ్యాయం ద్వారా కానీ సేకరించిన జ్ఞానాన్ని మనసు అనే ఇనప్పెట్లో దాయాలి. అలా దాచినప్పుడు మీకు కావలసినప్పుడు అది చెప్పడానికి బయటకు వస్తుంది. అంతేకానీ 10 విషయాలు నేర్చుకుని 100 చెత్త విషయాలు పోసుకుంటే 10 విషయాలు

కూడా పాడైపోతూ వుంటాయి, అవసరమైనప్పుడు జ్ఞాపకం రావు.

చాలామంది నా దగ్గరికి వచ్చి మేము చదువుతున్నాం కానీ మాకు జ్ఞాపకం ఉండట్లేదండి అంటారు, మేము గుర్తుంచుకోలేక పోతున్నామండి మరి మీరు ఎలా గుర్తుంచుకుంటారు అని నన్ను అడుగుతారు. కానీ నేను ఎవ్వరి విషయాలూ మనసులోకి తీసుకోను, విని వదిలేస్తాను. అందుకే నాకు అవసరమైన జ్ఞానం గుర్తు ఉంటుంది.

మీకు "శ్వాస మీద ధ్యాస" అనంతమైన సంపద ఇస్తూ ఉంటే ఆ సంపదను ప్రక్కకు తోసి వాళ్ళూ, వీళ్ళూ చెప్పినవి మనసులో వేసుకోవడం, ప్రక్కవాళ్ళ గురించి ఆలోచించడం ఎలా ఉంటుందంటే? ఇల్లంతా శుభ్రం చేసి మళ్ళీ ఇసుక తీసుకొచ్చి ఇంట్లో పోసుకున్నట్టు ఉంటుంది.

మరి గురువు వచ్చాక మీ బాహ్య దృష్టి, అంతర్ దృష్టి క్రింద ఎప్పుడైతే మారిందో అంతరంలోనే వజ్రాల మూట ఉంది అని తెలుసుకుంటారు. అది దొరికే వరకు ప్రయత్నిస్తూనే ఉండాలి. మరి ఆ ప్రయత్నంలో మళ్ళీ మధ్యలో బాహ్యంలోకి వెళ్ళి ఏదీ మీలోకి స్వీకరించకూడదు. అంటే బాహ్యంగా వెళ్తున్నా, దృష్టి మాత్రం అంతరంలో ఉంచాలి. శరీరాన్ని బాహ్యంలో తిప్పండి కానీ, మనసుని ఎప్పుడు బాహ్యంలో తిప్పొద్దు.

ఎవరు గుర్తుకు వచ్చినా ఈ సమయంలో నేను వాళ్ళకి గుర్తుకు రాను మరి నాకెందుకు వాళ్ళు గుర్తుకు రావాలి! నా జ్ఞానం నాది, నా సాధన నాది అనుకుంటూ మీ సాధన చెయ్యాలి. **"అంతరంలోకి వెళ్ళిన మనసు మీకు మిత్రుడు అవుతుంది, బాహ్యంలో తిరిగే మనసు మీకు శత్రువు అవుతుంది".**

చిన్న పిల్లవాడు ఏదీ మనసులో పెట్టుకొని ప్రవర్తించడు. అలాగే మీరు కూడా ఎవరు గుర్తు వచ్చినా మీ మనసులో నుంచి వాళ్ళని తీసేస్తే, అంటే మనసులో ఎవరి మీదా మమకారాలు, బంధాలు, రాగద్వేషాలు లేకపోతే చిన్న పిల్లవాడి మనసు అయిపోతుంది.

అనుకున్నా ఆచరణలో పెట్టుకోలేకపోతున్నారు అంటే మీ శక్తి సరిపోవట్లేదు, సరిపోవాలి అంటే సాధన పెంచాలి.

సృష్టిలో ఏ జీవులకి లేనంత గొప్ప మనసు మానవులకి ఇవ్వబడింది అంటే దాన్ని పరిశీలనలో పెట్టి, బుద్ధితో ఆలోచించి సమస్యకి పరిష్కారం కనుక్కోవడానికే మనసు ఇవ్వబడింది.

అంటే బాహ్యంగా తిరుగుతున్న మనసును అంతరంలోకి తిప్పి ఆత్మ దగ్గరికి చేర్చగలిగితే అప్పుడు మీ జీవితం అంతా కూడా ఆనందమయంగానే ఉంటుంది. అందుకే అంతరంలోకి తిప్పి సమస్యలకి పరిష్కారం తెలుసుకోవాలి.

అలా తెలుసుకున్న మానవుడు ఎప్పుడూ సందేశాలు ఇస్తూ ఉంటాడు. అలాంటి మానవుడిని జ్ఞాని అంటారు. ఆ జ్ఞానికి ఎప్పుడూ కూడా సందేహాలు రావు. అందుకే జ్ఞానులు సందేశాలను ఇస్తారు, సందేహాలు నివారణ చేస్తారు. మీరు సందేశాలు ఇస్తున్నారు అంటే మీరు ఏ సందేహాలు లేని స్థితిలో ఉన్నారు.

అంటే మీకు లోనికి వెళ్ళాక అన్ని ప్రశ్నలకి సమాధానాలు దొరుకుతూనే ఉంటాయి. రమణ భగవానుడి దగ్గరికి ఎన్నో అడగాలని వచ్చిన పాల్ బ్లంటన్ ధ్యానం చేసాక ఒక్క ప్రశ్న కూడా అడగకుండా వెళ్ళిపోయాడట.

అంటే అన్ని సమాధానాలు ఆయనకి ఆత్మ నుంచే వచ్చాయి. మీరు కూడా ఆ స్థాయికి చేరవచ్చు. బాహ్య ప్రయాణం చేసినా మనసుని ఎక్కడా అంటించుకోకుండా ఉండాలి.

ఏది చూసినా చలించకుండా, ఏది చూసినా కావాలనే కోరిక లేకుండా ఉండగలగాలి. ప్రతి దాని వెనకాల ఉన్నది భగవంతుడి శక్తే, అది నాలోనే వుంది, అక్కడ కొద్దిగా ఉంది, నాలో పూర్ణంగా ఉంది. నాలో ఉన్న భగవంతుడ్ని నేను తెలుసుకుంటే నేను పూర్ణమైన ఆనందాన్ని పొందగలను అని తెలుసుకోవాలి.

మరి ఈ పరమ సత్యాన్ని పరమ గురువులు మనకు బోధించారు. ఆ పరమ ఆనందాన్ని పొందగలిగే స్థితే "శ్వాస మీద ధ్యాస" ధ్యానం.

# బహిర్ సాధన - అంతర్ సాధన

చాలామంది ఎంత సాధన చేసినా మాలో పురోగతి రావట్లేదు అనే నిరుత్సాహంతో ఉంటూ ఉంటారు. మరి ఎందుకు పురోగతి సాధించట్లేదు? అంటే సాధనలో లోపాలను సరి చేసుకోకపోవడం వల్ల సాధన కుదరక పురోగతి సాధించలేరు.

అందుకే పత్రి గారు మనకి ప్రతి నిత్యము సాధన, స్వాధ్యాయం, సజ్జన సాంగత్యం ఉండాలి అంటారు. పత్రిగారిలా ఏ గురువు శిష్యుల కోసం, శిష్యులు అభివృద్ధి కోసంఇంతలా చెప్పలేదు అనిపిస్తుంది.

ఎందుకంటే ఆయన కరోనా సమయంలో తన బిడ్డలు ధ్యానానికి, జ్ఞానానికి దూరం కాకూడదని జూమ్ సెక్షన్ ఓపెన్ చేసి సందేశాలన్నీ చెప్పేవారు. ఆయన మార్గంలో నడుస్తూ మనమంతా కూడా జ్ఞానం పెంచుకుంటున్నాం.

ఇది లేకపోతే నష్టం ఏమిటి? అని చాలామంది అనుకోవచ్చు. కానీ ఈ సాధన, ఈ జ్ఞానము మనకు లేకపోతే మీ దృష్టి ఎప్పుడూ కూడా బహిర్ముఖంగా ఉంటుంది. ఈ బహిర్ముఖంగా ఉన్నప్పుడు బుద్ధి చంచలంగా ఉంటుంది. అలా చంచలంగా ఉండడం వల్ల అది అలా ఉందేంటి? ఇది ఇలా ఉందేంటి? అని అంటూ వుంటారు.

అలా అన్నంత కాలం మీ దృష్టి బహిర్ దృష్టిలో ఉన్నట్లే. ఎప్పుడైతే మీ దృష్టి అంతర్ దృష్టి అవుతుందో అప్పుడు బాహ్య ప్రపంచాన్ని విశ్లేషించకుండా ఆపగలుగుతారు.

ఎందుకంటే అన్నీ భగవంతుని సృష్టే. మరి మీరు ఎవరో విశ్లేషించ డానికి మీకు అంతర్ దృష్టి ఏర్పడుతుంది. అన్నిటా, అంతటా ఉన్నది భగవంతుడే అని అర్థమైనప్పుడు మీరు విశ్లేషణ చేయరు. ఒక దొంగని నువ్వు దొంగవి, మంచివాడివి కాదు అని మాట్లాడకూడదు. కారణం వాడు చేసిన పనికి శిక్షలు వేయడానికి పరమాత్మ ఉన్నాడు.

కానీ అలా మాట్లాడకుండా ఉండడానికి చాలా నిగ్రహ శక్తి ఉండాలి. ఎందుకంటే పుట్టుకతోటి ఇవన్నీ అలవాటు చేసుకుని వచ్చారు. అందుకే పత్రి గారు **"నో కామెంట్, నో జడ్జిమెట్"** అని చెప్పారు. కానీ చాలా మంది ఆలోచించరు.

మరి బహిర్ దృష్టి ఉంటే నష్టం ఏంటి? అనే ప్రశ్న కూడా వస్తుంది. కానీ బహిర్ దృష్టి వున్నప్పుడు మీరెవరో తెలియకుండా పోతుంది. తల్లి గర్భంలో శరీరాన్ని ఏర్పరచుకొని, బయటికి వచ్చాక మనసుని ఏర్పరచుకొని ఈ బయటివన్నీ చూస్తూ ఈ శరీరం తోటి, ఇంద్రియాల తోటి తాదాప్యం చెంది తాను జీవుడిని అనుకుంటూ దుఃఖాన్ని అనుభవిస్తున్నారు.

అంటే బహిర్ దృష్టి ఉన్నప్పుడు నేను ఇలా ఉన్నాను, నా జీవితం ఇలా ఉంది, లేకపోతే ప్రక్కవాళ్ళు నన్ను విమర్శిస్తున్నారు అని బాధ కలుగుతుంది. అంటే ఆత్మ ఇంద్రియాలతోటి, శరీరంతోటి తాదాప్యం చెంది దుఃఖాన్ని అనుభవిస్తోంది.

మనసు కనిపించదు కానీ శరీరం అంటే కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు కనిపిస్తున్నాయి, ప్రపంచం కనిపిస్తోంది. ఈ పొలం నాది, ఈ ఇల్లు నాది, ఈ కారు నాది అనుకుంటూ వాటితో మమేకం అవుతున్నారు. అందుకని అలా ఉన్నన్నాళ్ళు జీవుడిగా ఉంటారు. దానివల్ల దుఃఖం తప్పదు.

మరి దుఃఖం ఎప్పుడు పోతుంది? గత జన్మ పుణ్యం వల్ల, సత్కర్మల ఫలితం వల్ల, భగవంతుడి అనుగ్రహం వల్ల, మీ జీవితంలోకి గురువు వచ్చి నీ దుఃఖానికి కారణం నీ బహిర్ దృష్టే అన్నప్పుడు మీలో మార్పు వచ్చి బహిర్ దృష్టి అంతర్ దృష్టి అయినప్పుడు దుఃఖం పోతుంది. అలాగే గురువు రెండు సాధనలు చెప్తాడు. 1) బహిర్ సాధన, 2)అంతర్ సాధన

మీరు సాధన చేస్తున్నారు కానీ, ఏది బహిర్ సాధన? ఏది అంతర్ సాధన? అన్నదితెలియదు. అది కూడా తెలుసుకోవాలి, రెండు సరిగ్గా బ్యాలెన్స్ చేసుకుంటూ ఉండాలి.

# "బహిర్ సాధన"

వశిష్టామృతంలో వశిష్టుల వారు పురుషార్థము అని ఒక పదం వాడారు. అంటే గతజన్మ శుద్ధ వాసనల వల్ల చేసిన సత్కర్మల ఫలితం వల్ల, పరమాత్మ అనుగ్రహం వల్ల గురువు వచ్చి సాధనా మార్గాన్ని బోధిస్తాడు. ఇది మీ ప్రారబ్ధం. అంటే ఇప్పుడు మీరు ధ్యాన మార్గంలో వున్నారంటే ఖచ్చితంగా మీ ప్రారబ్ధ కర్మల వల్లే వచ్చినట్టు.

అలా గురువు వచ్చి బోధించినప్పుడు మూడు వంతుల ప్రారబ్ధ కర్మలు వున్నా ఒక వంతు పురుష ప్రయత్నం లేకపోతే సాధనలో ముందుకు వెళ్ళలేరట.

శుద్ధ వాసనలు అంటే ముక్తోపనిషత్తులో రాముల వారు చెప్తారు. **"పరమాత్మ వైపుకు వెళ్ళే ఆలోచనలు శుద్ధ వాసనలు, ప్రపంచం వైపుకు వెళ్ళే ఆలోచనలు అశుద్ధ వాసనలు".** అంటే ఎవరైతే గత జన్మలో పరమాత్మ కోసం ప్రయత్నం చేసి వస్తారో వారివి శుద్ధ వాసనలు. అవి గత జన్మ నుంచి వాళ్ళు తెచ్చుకున్నారు. మరి అలాంటి వాళ్ళకి సత్కర్మల పుణ్యం ఉన్నప్పుడు చాలా ఆత్రంగా, చాలా తపనగా గురువు దగ్గరికి వస్తారు.

మరి అది ప్రారబ్దంగా మూడు వంతులు నీ జీవితంలో ఉన్నా ఈ జన్మలో నువ్వు చేసిన పురుష ప్రయత్నమే నిన్ను అత్యున్నత స్థితికి చేరుస్తుంది. ఇది నీ బహిర్ సాధనలో తొలిమెట్టు. ముందు గురువులు బుద్ధిని వికసింప చేసుకో అంటారు. ఎందుకు బుద్ధిని పెంచుకోమని గురువులు మనకు బోధిస్తారంటే? ఆత్మ వల్లే శక్తిని పొందిన బుద్ధి ఆత్మని దర్శించదట. కానీ ఆత్మ దగ్గరికి చేరుకోవడానికి చేసిన ప్రయత్నాలన్నిటిని కూడా ఫలింప చేస్తుందట.

మరి మనసుకి, బుద్ధికి, ఈ ప్రాణులకి శక్తిని ఇచ్చేది పరమాత్మే. ఇప్పుడు ప్రాణం వల్ల మనిషి బ్రతుకుతున్నాడు, జీవులు బ్రతుకుతున్నాయి అనుకుంటున్నారు. ఆ ప్రాణానికి కూడా అంత శక్తిని ఇచ్చింది పరమాత్మే

అంటే ఆత్మే.

ఎందుకు బుద్ధిని వికసింప చేసుకోవాలి? అంటే గురువు చెప్పిన బహిర్ జ్ఞానం నీలోకి ఇంకిపోవడానికి.

బుద్ధిని వికసింప చేసుకో అనగానే బుద్ధే గొప్పది అనుకోవచ్చు కానీ, ఆ బుద్ధి కూడా వికసింప చేయడానికి కారణం నీ ఆత్మశక్తే. ఈ ఆత్మశక్తి వల్ల బుద్ధి వికసించి గురువు చెప్పిన బోధ బుర్రకి ఎక్కుతుంది. బుర్రకి బాగా ఎక్కినప్పుడు గురువు చెప్పిన ఒక్క మాట కూడా ఆ శిష్యుడు పాటించకుండా వుండడు.

అలాగే నీ కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు, అంతరేంద్రియమైన మనసు బాగా పని చేయాలి.  ఎందుకంటే ఈ శరీరం ఇచ్చిన భగవంతుడ్ని వీటి సహాయంతో తెలుసుకోవాలి. శరీరం వేస్ట్ కాదు, శరీరం మీదే దృష్టి పెట్టడం వేస్ట్.  జ్ఞానం పెరిగే కొద్ది ప్రతి మాట అర్థం చేసుకోవాలి, సృష్టించిన ప్రతిదీ కూడా ఉపయోగించుకోవడం చేత కావాలి.

కానీ వాటి మీద భ్రాంతితో పరమాత్మను తెలుసుకోలేనేమో అని అనుకోకూడదు. గురువు నువ్వు శరీరం కాదు ఆత్మవి అని చెప్తారు. లేకపోతే శరీరం మీద భ్రాంతి వదలరు. శరీరంతో మమేకమై వుండిపోతారు. ఈ శరీరం సాయంతో నీ ఇంద్రియాలకు,  నీ మనసుకు, నీ బుద్ధికి శక్తినిచ్చే పరమాత్మను నువ్వు తెలుసుకోగలగాలి.

మానవ దేహం తీసుకున్నావు కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు, అంతరేంద్రమైన మనసు, బుద్ధి కూడా నువ్వు ఉపయోగించగలగాలి. అందుకే నా పూర్వజన్మ పుణ్యంవల్ల పత్రిగారు వచ్చారు అనుకుంటూ పురుష ప్రయత్నం లేక ఎందరో వెనక పడుతున్నారు. ఎందుకు పురుష ప్రయత్నం తీవ్రంగా చేయట్లేదు? అంటే ఆయన  చెప్పిన మాటలు బుర్రకి ఎక్కలేదు. ఎందుకు బుర్రకి ఎక్కలేదు? అంటే వాళ్ళకి ప్రాపంచికంగా కనిపించేవన్నీ సాధించాలి, సంపాదించాలి, అనుభవించాలనే కోరిక వుండటం వల్ల. ఇలా ప్రాపంచిక

దృష్టి, శరీర దృష్టి, మనసు మీద దృష్టి ఉండడం వల్ల గురువు ఇచ్చిన జ్ఞానం బుర్రకెక్కదు.

నేను ఆత్మజ్ఞానం, బ్రహ్మజ్ఞానం పొందాలి ఈ సృష్టిలో ఉన్న అన్ని ఆనందాలకంటే కూడా గొప్ప ఆనందం అయిన ఆత్మానుభూతిని పొందినప్పుడు మాత్రమే నేను పొందగలను అని గురువు మాటల ద్వారా గ్రహించి శిష్యుడు అంతర్ముఖమై సరైన సాధన చేసి ఆత్మానుభూతిని పొంది ఈ జన్మే చివరి జన్మ చేసుకోగలుగుతాడు. దానికి ఇప్పుడు చేసే తీవ్రాతి తీవ్ర సాధనే పురుష ప్రయత్నం.

ఈ మార్గంలోకి వచ్చినా జ్ఞానం పొందలేక పోవడానికి కారణం, వెనక్కి వెళ్లిపోవడానికి కారణం నీ ప్రారబ్ధం వల్ల నీకు గురువు దొరికినా, ఆత్మను తెలుసుకోవాలని ఆసక్తి వచ్చినా ఈ జన్మలో నీ పురుష ప్రయత్నం లోపించడమే.

కనుక నీ కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు, అంతరేంద్రియమైన మనసును ఉపయోగించి గురువు చెప్పిన జ్ఞానాన్ని నీ బుద్ధికి ఎక్కించాలి. ఇప్పుడు చూడండి కర్మేంద్రియాలు జ్ఞానేంద్రియాలు ఉపయోగించడం ఏంటి? అసలు శరీరం వద్దంటున్నారు కదా అంటారు. మరి గురువు చెప్పిన జ్ఞానాన్ని వినాలంటే చెవులు కావాలి, స్వాధ్యాయం చేయాలంటే కళ్ళు కావాలి, ఇంకాస్త జ్ఞానాన్ని సజ్జన సాంగత్యం ద్వారా పొందాలి అంటే మీ శరీరాన్ని తీసుకొచ్చి కూర్చోబెట్టాలి, అంటే సాధనకి ఇంద్రియాలు అవసరమా? కాదా?

ముందు గురువు ఏం చెప్పాడు? శ్రవణం, మననం, స్వాధ్యాయం, సజ్జన సాంగత్యం, విచారణ. ఈ ఐదూ నీ జీవితంలో వుండాలి అని. ఇవే ఈ జన్మకి నువ్వు చేస్తున్న పురుష ప్రయత్నాలు. మరి విన్నవి, వ్రాసుకున్నవి మననం చేసుకుంటూ, విచారణ చేసుకుంటూ, విశ్లేషణ చేసుకుంటే గురువు నువ్వు శరీరం కాదు ఆత్మ అని చెప్పింది కరెక్టు అన్నది మీ విచారణ ద్వారా, మీ విశ్లేషణ ద్వారా మీకు అర్థమవుతుంది.

అర్థమైనప్పుడు నిజమే కదా? గత జన్మలోని ఆ శరీరంలో ఉన్నది ఆత్మే, అక్కడ చేసిన కర్మవాసనలను కూడా తీసుకువెళ్లి ఆ కర్మలని అనుభవిస్తూ, పాఠాలు నేర్చుకుంటూ, సరైన సాధన చేసి, ఆత్మకి దగ్గరై ఆత్మానుభూతిని పొందాలి. అందుకే పరమాత్మ నాకు ఈ గురువునిచ్చాడు అని నీ విచారణ ద్వారా నువ్వు తెలుసుకోవాలి. ఈ ప్రయత్నమంతా బహిర్ సాధన. శ్రవణం, మననం, సజ్జన సాంగత్యం, స్వాధ్యాయం, విచారణ ఇవన్నీ బహిర్ సాధనలు.

అయితే 23 సంవత్సరాల నుంచి పత్రిగారి జ్ఞానమే పట్టుకొని ఎంతో నేర్చుకుంటూ, ఎంతమందికో నేర్పుతూ మనం ముందుకు వెళ్తున్నా ఎందుకు కొందరు ఇందులోకి వచ్చి ఇమడలేక వేరే వేరే తిరుగుతున్నారు? అంటే ఆయన చెప్పిన విషయాల మీద శ్రద్ధ పెట్టకపోవడం.

పత్రి గారు శ్రవణం చేయమన్నారు అంటే గురువు చెప్పింది తదేక దీక్షతో వినాలి. అందరూ వింటారు కానీ గురువు చెప్పిన ప్రతి మాటా వ్రాసుకుని మననం చేసుకోవాలి, ఆ తర్వాత మళ్లీ స్వాధ్యాయం ద్వారా మననం చేసుకోవాలి, విచారణ చేసుకోవాలి అని పత్రిగారు అందరికీ చెప్తుండేవారు.

మరి ఎవరు వినకపోయినా రాఘవరావు గారు ఒక్కరే ఎందుకు విన్నారంటే ఆయన సరియైన శిష్యుడు కాబట్టి. గురువులకి ఆత్మ సాక్షిగా స్వీకరించిన శిష్యుడు ఓకే ఒక్కడు ఉంటాడు. పత్రి గారికి రాఘవరావుగారు అటువంటి శిష్యుడు. ఆయన ఏం చెప్తే అదే చేస్తారు. మరి ఎప్పుడూ మీ కూడా పాకెట్ బుక్ ఉండాలి, నేను చెప్పినవన్నీ వ్రాసుకోవాలి అంటే ఆనాటి నుంచి ఈనాటి వరకు మేము ఫాలో అయ్యాం. మా శిష్యులకు అదే చెప్తున్నాం.

అలా వ్రాస్తున్నారు కాబట్టే ఈవేళ అందరి దగ్గరికి వెళ్లి క్లాసులు చెప్తున్నారు. మిగతావాళ్లు చెప్పలేకపోతున్నారు.

అంటే గురువు మనకి చెప్తాడు దాన్ని ఏ రూపంలో పెట్టుకోవాలి అన్నది ఈ స్థాయికి వచ్చాక అర్థం కావాలి. స్వాధ్యాయం చేయాలి అంటే క్లాసులోకి వెళ్లి స్వాధ్యాయం చేయండి అని చెప్తే కాదు. గురువు చెప్పిన

ప్రతిదీ ముందు ఆచరణలో పెట్టుకోవాలి, ఆలోచించుకోవాలి. అదే విచారణ అంటే! మరి అది చేయకే రాఘవరావుగారి శిష్యుల స్థాయికి ఎవ్వరి శిష్యులు ఎదగలేదు.

అందుకే చాలామంది మూడు రోజులు క్లాసులు చెప్పే స్థాయికి ఎదిగి పోయారు. అంటే వీళ్ళు చేస్తున్న స్వాధ్యాయం, వీళ్ళకున్న గురుభక్తి, వీళ్ళు పడుతున్న శ్రమ, వీళ్ళకున్న పట్టుదలే దానికి కారణం. బహిర్ జ్ఞానం అంతా బుద్ధిలో ఇంకిపోయినప్పుడు ఏదైనా సరే ఆత్మ దగ్గరికి చేరాలి అనే పట్టుదల ఉంటుంది. మరి మనవాళ్లే పత్రి గారు ఇచ్చిన సాధన తూచా తప్పకుండా చేస్తున్నారు.

మిగతా వాళ్లు గైడింగ్‌లని, మ్యూజిక్ అని, కర్మ విపాక అని రకరకాల ధ్యానాలు చెప్తున్నారు. మరి సరియైన సాధనే లేనప్పుడు ఇందులో ఎలా ఎదగగలరు? ఇక్కడ పురుష ప్రయత్నమే తప్పుగా చేస్తుంటే ఆ శిష్యుడు అంతర్ముఖ ప్రయాణం సులువుగా ఎలా చేస్తాడు? గురువు చెప్పడానికి వచ్చాడు, నేర్చుకోవాల్సింది శిష్యుడే, కష్టపడవలసింది శిష్యుడే, శ్రద్ధ పెట్టవలసింది శిష్యుడే.

"శ్వాస మీద ధ్యాస" పెట్టి అంతర్ముఖ ప్రయాణం చెయ్యి, ఆత్మానుభూతిని పొందుతావు అని గురువు ఒక్క మాట చెప్తే, నేను అంతర్ ప్రయాణం చేసినప్పుడు నాకు ఉన్న అడ్డు ఏంటి? అని విచారణ చేసుకోవాల్సింది శిష్యుడే.

ధ్యానంలో కూర్చుని లోతుల్లోకి వెళ్లినప్పుడు ప్రక్కన సెల్‌ఫోన్ మోగిస్తే చేసే సాధన ఎలా చేస్తారు? అంటే నేను ధ్యానం చేస్తున్నప్పుడు ఏ శబ్దము బాహ్యంగా నాకు వినబడకూడదు అప్పుడే నా అంతర్ ప్రయాణం ఈజీగా జరుగుతుంది అని తెలుసుకోవాలి. కానీ ఈ గైడింగ్లు, మ్యూజిక్లు పెట్టుకుంటే అసలు లోపలకే వెళ్లలేరు.

ప్రపంచం దృష్టిలో ఆస్తికత్వం, నాస్తికత్వం కాదు. పరమాత్మ దృష్టిలో సరియైన ధ్యానం చేస్తున్నామా? సరియైన ప్రయత్నం చేస్తున్నామా? అన్నది

చూసుకోవాలి. గతజన్మ ప్రారబ్ధం వీడికి మూడు వంతులు ఉన్నా, పత్రిగారి లాంటి ఒక సద్గురువు జీవితంలోకి వచ్చినా, 1/4 పురుష ప్రయత్నం లో తప్పు ఉండడం మూలాన ఆ అంతర్ సాధన చేయలేకపోతారు. బహిర్ సాధనలు తప్పుగా చేస్తే అంతర్ముఖ ప్రయాణం సులువుగా సాగదు. ఈ సత్యం ఉపనిషత్తులో ఖచ్చితంగా ఇవ్వబడింది.

గురువు వచ్చాక నీకు బహిర్ సాధన ఇస్తాడు, అంతర్ సాధనకి ఎలా వెళ్ళాలో, లోతుల్లోకి ఎలా వేళ్ళాలో చెప్తాడు. అందుకే గురువు వచ్చాక మొదట  నీ ఇంద్రియాలు చాలా జాగ్రత్తగా ఉపయోగించాలి. బహిర్ సాధనలో ఉపయోగించవలసింది అన్నీ ఇంద్రియాలే. గురువు చెప్పే మాటలు శ్రద్ధగా వినాలి అంటే ఆ గురువు మీద నమ్మకం, విశ్వాసం ఉంచుకోవాలి. ఆ పరమాత్మను చేరడానికి ఆయనే ఒక గురువుని మీ జీవితంలోకి పంపుతాడు కాబట్టి.

కానీ ఈ శరీరానికి, ఈ ఆత్మకి మధ్యలో మనసు అనేది ఏర్పడి అంతర్ ముఖం అయినప్పుడు బహిర్ముఖంగా లాగేస్తుంది. అప్పుడు  బుద్ధి చంచలం అయిపోతుంది. అంతర్ముఖం అయినప్పుడు నిశ్చల బుద్ధి వల్లే బహిర్ జ్ఞానాన్ని స్వీకరించగలరు. బహిర్ జ్ఞానం అంటే  ప్రాపంచిన జ్ఞానం కాదు. గురువు ఇచ్చిన ధర్మ సూక్ష్మాలు, గురువు ఇచ్చిన జ్ఞానపరమైన సందేశాలు, గురువు చెప్పిన పుస్తకాల యొక్క జ్ఞానం ఇవన్నీ బహిర్ సాధనలో భాగాలే.

బుద్ధిని ఉపయోగించి నువ్వు కళ్ళు తెరిచి సేకరించిన జ్ఞానం అంతా కూడా బహిర్ సాధనే అవుతుంది. ఎందుకంటే ఆత్మ ఆ బుద్ధికి కూడా శక్తినిచ్చింది. మరి ఆత్మ వైపు సులువుగా ప్రయాణం చెయ్యాలి అంటే ముందు గురువు చెప్పింది శ్రద్ధగా విని వ్రాసుకోవాలి, ఖాళీగా ఉన్నప్పుడు మననం చేసుకోవాలి, గురువు చెప్పిన పుస్తకాలన్నీ స్వాధ్యాయం చేయాలి, విచారణ చేయాలి. ఈ 5 నీకు గురువు చెప్తాడు శ్రవణం, మననం, స్వాధ్యాయం, సజ్జన సాంగత్యం, విచారణ. ఇవన్నీ సరిగ్గా చేయాలి.

ఇంకా ముఖ్యమైనది సరైన ధ్యానం. సరికాని ధ్యానాలు చేస్తే సాధించేది ఏదీ లేదు. సరియైన సాధన చేస్తే ఆనంద స్వరూపుడవు అవుతావు. ఈ చిన్న విషయం తెలుసుకోలేక పంతాలకి, పట్టుదలకి పోయి వాళ్ళు చెప్పేది ఏంటి? మేము సీనియర్లం. పత్రిగారు ఇలా చేశారు, అలా చేశారు అని ఎన్నో చెప్తున్నారు.

పత్రిగారు మిరపకాయ బజ్జీలు ఒకసారి తిన్నారని రోజంతా తింటే అల్సర్ వచ్చి చచ్చిపోతారు. ఆయన చేశారంటే ఏదో కారణం వుంటుంది. ఆయన చేశారని మీరు చేయకూడదు. అందుకే నీ పురుష ప్రయత్నంలో ఏ చిన్న లోపం ఉన్నా నువ్వు ఆత్మానుభూతిని పొందలేవు. అంతర్ ప్రయాణం నిశ్చలంగా చేయలేవు.

అందుకే బహిర్ సాధన, అంతర్ సాధన అని రెండు రకాలుగా ఉన్నాయి. బహిర్ సాధన అంటే శ్రవణం, మననం, స్వాధ్యాయం, విచారణ, సజ్జన సాంగత్యం. ఇవి నీ అంతర్ సాధన బాగా జరగడానికి ఉపయోగ పడతాయి.

అందుకే ఋషులు మీ ప్రారబ్ధ కర్మ వల్ల గురువు వచ్చినా, మీరు ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చినా ఇక్కడ చేసే పురుష ప్రయత్నంలో లోపం ఉంటే వెనక్కి వెళ్ళిపోతారు అని చెప్పడం జరిగింది. గురువు చెప్పిందే ఫాలో అయిన వాళ్ళు ఎదుగుతున్నారు. గురువు చెప్పిన 'శ్వాస మీద ధ్యాస' ప్రక్కన పెట్టి మ్యూజిక్ మీద, గైడింగ్ మీద ధ్యాసలు పెడితే శిష్యులు శిష్యుల్లాగే వుండిపోతారు.

కానీ ప్రతి శిష్యుడు గురువై తీరాలి అన్నది పత్రిగారి కల. అది ప్రకృతి లో ఉన్న సనాతన ధర్మం. ఎందుకు అంటే ప్రతి శిష్యుడు గురువయ్యే అర్హత ఉంది. ఆ గురువయ్యే అర్హతను పోగొట్టుకుంటున్నారు అనే జ్ఞానం కూడా లేదు. కానీ మానవుడికి బుద్ధి వుంది, ఆ బుద్ధితో విచారణ చెయ్యాలి, విశ్లేషణ చెయ్యాలి, గురువు చెప్పింది చెయ్యాలి. మీ బహిర్ సాధన ఎంత

బాగుంటుందో, అంతర్ సాధన అంత బాగా సాగుతుంది.

## "అంతర్ సాధన"

చాలామందికి ధ్యానంలో కూర్చున్న వెంటనే సాధన కుదరదు. మరి బాగా కుదరాలంటే బాహ్యంలో మీరు ఏ రకమైన సాధన చేస్తే ముందుకి వెళ్ళగలరో తెలుసుకున్నాం, మరి అంతర్ సాధన ఎలా చేయాలో తెలుసు కుందాం. ధ్యానంలో కూర్చున్న వెంటనే మొట్టమొదటిగా వచ్చేది ఆలోచనలు. ఆలోచనలు ఒకదాని తర్వాత ఒకటి వస్తూనే వుంటాయి. ఆలోచనలు వస్తే ఆత్మను తెలుసుకోలేరు.

ఉదాహరణకి సముద్రంలో ఎన్నో అలలు ఉంటాయి. మరి అలలు ఉంటే సముద్రం యొక్క పూర్ణ రూపాన్ని చూడలేరు.

కానీ అలలను తప్పిస్తే సముద్రం ఎలా ఉంటుంది అన్నది చూడాలనే కోరిక ఎవరికీ ఉండదు. మరి ఆ విధంగానే మనసులో ఆలోచనలు, కోరికలు, సంకల్పాలు, ఇలాంటివన్నీ కూడా ధ్యానంలో ఇబ్బంది పెట్టేవే. అవి రాకూడదు అనుకుంటారు కానీ రాకుండా ఆగవు. ఈ ఆలోచనలు మూడు రకాలుగా వస్తాయి.

1) గతానికి సంబంధించినవి వస్తాయి.

2) వర్తమానానికి సంబంధించినవి వస్తాయి.

3) భవిష్యత్తుకు సంబంధించినవి కూడా వస్తాయి.

గతం అంటే జరిగిపోయిన విషయాలు గురించి ఆలోచనలు. వాటి వల్ల ఉపయోగం లేదు. వర్తమానంలోవి అంటే ఇప్పుడు ఒక పుస్తకం చదివి సాధనలో కూర్చుంటే వాటి మీద ఆలోచనలు వస్తూ ఉంటాయి. లేకపోతే మీకు గురువుగారు ఒక పని చెప్తే అది ఎలా పూర్తి చేయాలి అనే ఆలోచనలు వస్తాయి. భవిష్యత్తుకి సంబంధించినవంటే మీరు ఒక క్లాస్ అరేంజ్ చేయాలంటే ఎంతమందికి ఫోన్ చేయాలి, లేదా ఎలాంటి అరేంజ్మెంట్లు చేయాలి అనే ఆలోచనలు వస్తాయి.

అంటే ఈ ఆలోచనలు ఒకే రకంగా ఉండవు మూడు రకాలుగాను ఉంటాయి. అందుకే పత్రి గారు ఆలోచనలు గమనించండి అంటారు. ఎందుకంటే ఆలోచనలు కొన్ని అక్కర్లేనివి వస్తాయి. అంటే గతానివి వస్తాయి. జరిగిపోయినవి వస్తాయి. అవి కట్ చేసేయ్, వర్తమానంలో నువ్వు చేయాల్సిన పనులు ఒక్కొక్కసారి వస్తూ ఉంటాయి. అవి ఆత్మ నుంచి నీకు వస్తున్న సలహాలు అనుకో, మరి భవిష్యత్తు అంటే జరగబోయే విషయాల గురించి, నువ్వు చేయవలసిన పనుల గురించి రావచ్చు. అవి గమనించు ఆ తర్వాత అలా ఉండిపోవద్దు. అక్కడితో కట్ చేసి "శ్వాస మీద ధ్యాస" పెట్టాలి.

అందుకే పత్రిగారు ఎప్పుడూ కూడా ఆలోచనలు గమనించు, కట్ చెయ్. ఈ రెండు మాటలు మాట్లాడేవారు. ఎప్పుడైతే ఆలోచనలు ఉంటాయో ఆత్మానుభూతిని పొందలేరు. అందుకే ఎప్పటికప్పుడు ఆలోచనలు కట్ చేసుకుంటూ "శ్వాస మీద ధ్యాస" పెట్టాలి అని ప్రతి సాధకుడు తెలుసుకోవాలి.

అలాగే మీ ఇంద్రియాలకు, మనసుకు శక్తిని ఇస్తుంది ఆత్మ. మనసుకు శక్తిని ఇస్తున్న మూలానే మనసు ఆలోచిస్తుంది, కోరికల్లో ఉంది, సంకల్పాల్లోనూ ఉంది. మరి ఇంతటి శక్తినిచ్చే ఆత్మని నేను దర్శించాలి కానీ ఆలోచనలు దర్శిస్తున్నాను అంటే మనసునే దర్శిస్తున్నాను. మనసును దర్శించడం వల్ల నేను శక్తిని కోల్పోతున్నాను అని తెలుసుకోవాలి. మరి నాకు శక్తిని ఇస్తున్న ఆత్మను గమనించాలి అదే ధ్యానము అన్న ఎరుకలోకి రావాలి.

మామూలుగా ధ్యానంలో కూర్చున్నప్పుడు ఆలోచనలు వస్తాయి. మరి ఆలోచించే మనసుకి శక్తినిచ్చేది కూడా ఆత్మే. అంటే మనకు వచ్చే ప్రతి ఆలోచనకి శక్తి ఎవరు ఇస్తున్నారు? ఆత్మే ఇస్తుంది. ఆత్మే లేకపోతే మనసు లేదు, ఆలోచనలు లేవు. ఎలా వుంటాయి? చచ్చిపోయిన శవానికి మనసు ఉంటుందా? చచ్చిపోయిన శవం ఆలోచిస్తుందా? చచ్చిపోయిన శవం ధ్యానంలో కూర్చోగలుగుతుందా? ఆ శవం ఏమి చేయలేదు. ఎందుకు చేయలేదు? అందులో ఆత్మ లేదు కాబట్టి. ఆత్మ లేకపోతే ఆ ఇంద్రియాలకి,

శరీరానికి ఆత్మ శక్తి రాదు.

అందుకే నేను చూస్తున్నాను, వింటున్నాను, తింటున్నాను అంటే ఆత్మశక్తి వల్లే చేస్తున్నాను, ఆఖరికి నేను ధ్యానంలో కూర్చుని ఆలోచిస్తున్నాను అంటే దానికి కారణం ఆత్మే అని తెలుసుకోవాలి. అన్నిటికీ మూలం ఎవరు అంటే ఆత్మే, ఆ ఆత్మనే నేను దర్శించాలి. అంతవరకు ఈ ఆత్మకి శరీరం అనే బంధీఖానా తప్పదు. జైల్లో నుంచి విడుదల అవ్వాలంటే మంచి ప్రవర్తన ఉంటే తొందరగా విడుదల అవుతారు.

అలాగే భూమిమీదకు వచ్చిన ఈ ఆత్మ ఈ శరీరం అనే బంధీఖానాలో ఇరుక్కు పోయింది. అలాగే జీవితంలోకి గురువు వచ్చి నువ్వు పరమాత్మను చేరుకుని, చావు పుట్టుకలు అనే బంధీఖానా నుంచి తప్పించుకుని ఎక్కడి నుంచి వచ్చావో అక్కడికి వెళ్లాలి అని చెప్తారు. నువ్వు నిత్యుడివి. ఈ బంధీఖానాలో ఉంటూ, దుఃఖ పడుతూ, నేను ఇంతేనా అని శోకిస్తున్నావు. నువ్వు ఆనంద స్వరూపుడివే కానీ దుఃఖ స్వరూపుడివి కాదు అని గురువులు బోధించినా దీని నుంచి విడుదల కోసం నువ్వు ప్రయత్నించట్లేదు. కానీ అలా ప్రయత్నించే మార్గమే ఆధ్యాత్మిక మార్గం.

అన్నింటికి శక్తినిచ్చే ఆ మూలాన్ని నేను దర్శించగలిగితే ఈ బంధీఖానాలో నుంచి నేను బయట పడతాను అని ఎవరికి వాళ్ళు తెలుసుకున్నప్పుడు ఆలోచనల మీద ఉన్న దృష్టిని ఆలోచనలకు శక్తినిచ్చే ఆత్మ మీదకు మళ్ళిస్తారు అని ఉపనిషత్తులు బోధిస్తున్నాయి. మూలాల్ని తెలుసుకుంటే ఇంకా తెలుసుకోవాల్సింది ఏదీ లేదు అనుకున్నప్పుడు నీ అంతర్దృష్టి ఇంకా ఇంకా లోతులకి వెళ్తుంది.

చాలామంది బాహ్యంగా వాళ్ళంటే ఇష్టం, వీళ్ళంటే ఇష్టం అని శరీరాల్ని, శరీర సంబంధమైన వాళ్ళని ప్రేమిస్తూ ఉంటారు. నిజంగా చెప్పుకోవాలంటే ఆధ్యాత్మికతలోకి వచ్చాక శరీరాలని ప్రేమిస్తున్నామనే భ్రాంతిలో ఉన్నారు కానీ ప్రేమించేది ఆత్మనే. ఎందుకు అంటే శరీరంలో లోంచి ఆత్మ

తప్పుకుంటే ఆ శరీరాన్ని రెండు రోజులు ఇంట్లో వుంచుతున్నారా? అంటే ఎవరూ ఉంచరు. ఆ శరీరం పాడైపోతుందని తీసుకెళ్ళి దహనం చేస్తారు.

ఆత్మ తప్పుకోగానే వాడి చెప్పులైనా ఇంట్లో ఉంచుకుంటారు కానీ అంత ప్రేమించిన ఆ శరీరాన్ని బయట వేస్తున్నారు అంటే మీకు తెలిసినా తెలియకపోయినా మీరు ప్రేమించేది ఆత్మనే.

ప్రాపంచిక జీవితంలో నువ్వు ఎరుక లేకుండా జీవించావు. కానీ ఆధ్యాత్మిక జీవితంలో నీకు గురువు వచ్చాక నువ్వు ఎవరివో చెప్తాడు. నువ్వు ఆత్మవి, నువ్వు ప్రేమించవలసింది, ప్రేమిస్తున్నది ఆత్మనే అని. మరి అప్పటి వరకు ఎరుక లేకుండా ప్రేమిస్తున్నది ఆత్మనే. ఎరుకతో ఇక ముందు ప్రేమించాల్సింది ఆత్మనే అని తెలుసుకుంటారు. ఆత్మోన్నతికి శరీరమనే తొడుగేసుకొచ్చాను, నాకు నచ్చినంతవరకు ఇందులో ఉంటాను, నచ్చకపోతే వెళ్ళిపోతాను కనుక వెళ్ళిపోయేది శక్తివంతం అవ్వాలి, నేర్చుకోవాల్సిన జ్ఞానం నేర్చుకోవాలి అని తెలుసుకుంటాడు.

ప్రాపంచికంలో ఉన్నన్నాళ్ళు ఇవేవి తెలియవు. కానీ గురువు వల్ల ఆత్మజ్ఞానం వచ్చాక నువ్వు భ్రాంతిలో ఉన్నావు, అందరూ నిన్ను, నీ శరీరాన్ని ప్రేమిస్తున్నారు అనుకుంటావు. కానీ నిన్ను ప్రేమిస్తే నీ శరీరంలో ఆత్మ తప్పుపోగానే నీ శరీరాన్ని దహనం చేయడానికి ఎందుకు కంగారు పడతారు?

అందుకే ప్రేమించేది ఖచ్చితంగా నిన్ను కాదు. నీలో ఉన్న ఆత్మనే ప్రేమిస్తున్నారు అని చెప్తారు. ఈ సత్యం చెప్పడానికి కటువుగా ఉన్నా, వినడానికి నమ్మబుద్ధి కాకపోయినా ఇది పరమ సత్యం. ఇది తప్పుగా అనిపిస్తుంది. అందుకే ప్రాపంచికంలో రైట్ అనుకున్నవన్నీ ఆధ్యాత్మికంలో తప్పు. ఆధ్యాత్మికత లో రైట్ అనుకున్నదంతా ప్రాపంచికంలో తప్పవుతుంది.

విగ్రహారాధన ప్రాపంచికంలో కరెక్ట్ కానీ ఆధ్యాత్మికతలో ఆత్మారాధనే అసలైన ఆరాధన, ఇంక అంతకంటే ఆరాధనలు లేవని గురువులు చెప్తున్నప్పుడు వాళ్ళ మాటలు, వాళ్ళ ఆలోచనలు కఠినంగా కనిపిస్తాయి. పరమ సత్యాలు

ఎప్పుడూ కూడా కఠినంగానే వుంటాయి, వినడానికి ఇంపుగా ఉండవు. ఈ సృష్టిని సృష్టించిన సృష్టికర్త నీలోనే అణువంతగా, ఆత్మగా ఉన్నాడు. ఆ ఆత్మను ఆరాధించడమే ధ్యానము అని ప్రపంచంలోకి వెళ్లి చెప్తే మనకి పిచ్చెక్కింది అనుకుంటారు, కానీ అదే పరమ సత్యము.

మరి అది తెలుసుకుంటేనే మోక్షం. మోక్షము అంటే ఏంటో? పుణ్యము అంటే ఏంటో? కూడా తెలియనంత అజ్ఞానంలో ప్రపంచం ఉంది. చాలామంది మీరు ధ్యానం ఎందుకు చేస్తారు అని అడుగుతారు. అందరూ భోగాలు కోరుకుంటారు, మేము భోగం ఎక్కడి నుంచి వస్తుందో ఆ భోగం దగ్గరికే వెళ్ళిపోవాలి అని ప్రయత్నిస్తున్నాం అంటాను.

ఉదాహరణకి అందరూ బంగారం కొట్టుకెళ్లి బంగారం కొనుక్కుంటారు. ధ్యానం చేసేవారు బంగారం గని దగ్గరికి వెళ్లి బంగారం తీసుకుంటారు అంతే తేడా. రిటైల్ షాప్ కి వెళ్లి మీ దగ్గర ఉన్న డబ్బుతో కొంటే కొంచమే వస్తుంది. బంగారం గని దగ్గరికి వెళ్తే ఎంతో ఉంటుంది. ధ్యాన సాధకులకు గనిని కొనగలిగేటంతటి కెపాసిటీ ఉంటుంది. ధ్యానం వల్ల మోక్షం వస్తుంది.

మరి ధ్యానం చేస్తున్నాం, చేస్తున్నాం అంటారు. ఆత్మ అంటే ఒక వెలుగు అనుకుంటారు. ఆత్మ అంటే వెలుగు కాదు. ఆత్మ ఏ రూపంలో ఉంటుంది అన్నదానికి ఉపనిషత్తులు ఏం చెప్పాయంటే? ప్రాణం రూపంలో నీ శరీరంలోనికి ఆ శక్తి ఎప్పుడు ప్రవహిస్తూనే ఉంది. మరి ఆ శక్తి "శ్వాస మీద ధ్యాస" పెట్టి ప్రాణం లోనికి ఎలా వెళ్తుందో నువ్వు గమనించగలిగితే నువ్వు ఆత్మానుభూతిని పొందగలవు.

అందుకే చాలా సింపుల్‌గా చెప్పారు. ఆలోచన దగ్గర ఆగిపోతే అసంపూర్ణ సాధన. ఆలోచనలకు మూలం ఏమిటో తెలుసుకొని అక్కడికి చేరుకుంటేనే నీది సంపూర్ణ సాధన. శ్వాసను గమనిస్తున్నాం అంటారు. ఎందుకు గమనించమన్నారు? ఈ శ్వాసని ఎవరు తీసుకుంటున్నారు? ఆ శ్వాసని 49

వాయువులుగా మార్చి శరీరానికి శక్తిని ఎవరు ఇస్తున్నారు? అన్నది తెలుసుకోవాలి.

అవి తెలుసుకుంటూ నీలోనికి అంతర్ ప్రయాణం సులువుగా చేసుకోవాలి. ఎన్ని రోజులు ధ్యానం చేసినా మాకు ఆలోచనలు తగ్గట్లేదు అంటారు. అంటే నువ్వు చేసే భావం కరెక్ట్ కాదు. ఏది కరెక్ట్ అంటే ఆలోచనలు ఎక్కడి నుంచి పుడుతున్నాయి? ఎందుకు పుడుతున్నాయి? ఆలోచనలు రావడానికి కారణం ఏంటి? అన్నది తెలుసుకుంటే తెలుస్తుంది. అంతేకాదు ఆత్మ శక్తి వల్లే మనసు పని చేస్తుంది, ఆ శక్తి వల్లే మనసు ఆలోచించ గలుగుతుంది, అంటే ఆత్మ లేకపోతే మనసు కూడా జడం అవుతుంది అని తెలుసుకోవాలి.

ఇంత శక్తిని ఇస్తున్న లోపల ఉన్న ఆత్మ అంత శక్తివంతమైంది కాబట్టి నువ్వు అక్కడి వరకు ప్రయాణం చేయాలి. మరి ప్రయాణం చేయాలి అంటే ఇంద్రియాలు పని చేస్తున్నంతసేపు ప్రయాణం చేయలేరు. ఇంద్రియాల పని ఆపాలి అంటే ఏ శ్వాస ద్వారా లోనికి శక్తి వెళ్తుందో ఆ శ్వాసని పట్టుకుంటేనే నువ్వు ఆత్మని చేరుకోగలవు అని పదే పదే నీలో నువ్వు మననం చేసుకోవాలి. ఎదుటివాడికి చెప్తే నీకు మననం అవ్వదు.

ప్రతి క్షణము శ్వాస తప్పించి రెండోది ఆత్మను చేరుకునే మార్గం కాదు. శ్వాస ద్వారా మాత్రమే నేను ఆత్మను చేరుకోగలను అని గుర్తుంచుకోవాలి.

అంతరేంద్రియమైన మనసు మన జీవితాన్ని అస్తవ్యస్తం చేయగలుగుతుంది. బాహ్యంలో తిరిగి దుఃఖ పడుతుంది, అంతరంలో తిరిగి ఆనంద పడుతుంది. మరి ఆ మనసే అంత గొప్పదైతే, ఆ మనసుకి శక్తినిచ్చి ఇంత బాగా నడిపిస్తున్న ఆత్మ ఎంత గొప్పది! అని విశ్లేషణ చేసుకోవాలి.

ఆత్మ వల్లే అన్నింటికీ శక్తి వస్తుంది అన్నప్పుడు మరి ఆత్మ ఇంత శక్తివంతం ఎలాగైంది? నిరంతరము ప్రాణశక్తి వల్లే ఆత్మ శక్తివంతం అవుతుంది. ఆ విశ్వశక్తి పరమాత్మ నుంచి నాలోకి వస్తుంది. నేను చేస్తున్న సాధన వల్లే

వస్తోంది అని తెలుసుకోవాలి.

విశ్వశక్తి విశ్వమంతా ఉంది కానీ అందరూ తీసుకోలేరు. ఎవరు తీసుకోగలరు అంటే! "శ్వాస మీద ధ్యాస" పెట్టి ధ్యానం చేసేవారు అనంతమైన విశ్వశక్తిని తీసుకుంటారు. ఇక్కడ బాహ్యంగా తిరిగినప్పుడు, బాహ్య దృష్టి ఉన్నప్పుడు విశ్వశక్తిని తీసుకోలేరు. అంతరంలోకి వెళ్లి నువ్వు అన్ని విషయాల్లో నీ మనసుని వెనక్కి తీసుకొచ్చి ఆత్మని దర్శించాలి, ఆత్మానుభూతి పొందాలి అనే ఒకే ఒక్క పని చెప్పాలి. దానికి పది పనులు చెప్తే శక్తి సరిపోదు, అందుకే అది విశ్వశక్తి తీసుకోదు. నీ అంతరంలోకి వెళ్లి దానికి చెప్పే ఒకే ఒక్క పని "శ్వాస మీద ధ్యాస".

మరి నువ్వు ఆ పని మీదే ఉన్నప్పుడు, నిరంతరము నీ "శ్వాస మీద ధ్యాస" ద్వారా విశ్వశక్తిని లోనికి తీసుకువెళ్ళినప్పుడు నువ్వు శ్వాస తీసుకుంటున్నాను అన్న విషయం కూడా తెలియనంత ఆత్మకి చేరువ అయిపోతూ ఉంటావు. ఒకసారి దృష్టి పెట్టడమేనండి తర్వాత ఆటోమేటిక్ గా శక్తి లోనికి వస్తుంది.

ఎప్పుడైతే ఆత్మ శక్తివంతం అవుతూ ఉంటుందో విశ్వమంతా నీకు దాసోహం అయిపోతుంది. ఇప్పుడు రైలు ఇంజన్ ఉంది, రైలు పెట్టెలు ఉంటాయి. ఇంజన్ స్పీడ్ గా వెళ్తేనే రైలు పెట్టెలు స్పీడ్‌గా వెళ్తాయి. ఇంజన్ స్పీడ్‌గా లేకపోతే రైలు పెట్టెలు స్పీడ్‌గా వెళ్ళవు. అలాగే ఆత్మ శక్తివంతం అయితేనే శరీరంలో కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు, అంతరేంద్రియమైన మనసు, మేధస్సు ఇంకా లోపల చాలా పని చేస్తాయి.

ఇప్పుడున్న మేధస్సుకి కొంత మేరే అర్థం చేసుకుంటున్నారు, చూడగలుగుతున్నారు. మరి ఆత్మ అంత శక్తివంతమైనప్పుడు చాలా విషయాలు ఈ లోకాలవే కాదు, పైలోకాలవి కూడా చూడగలిగే శక్తి వస్తూ ఉంటుంది. అందుకే నువ్వు బాహ్యంలో విచారణ ద్వారా ఇవన్నీ తెలుసుకుంటూ "శ్వాస మీద ధ్యాస" పెట్టినప్పుడు నీ అంతరంగ సాధన చాలా చక్కగా కుదురుతుంది.

అయితే ఇది అందరూ చేయగలరా అంటే? ఆత్మ బలహీనులకి, బద్ధకస్తులకి, అశ్రద్ధ చేసేవారికి, కృషి లేని వారికి ఎప్పుడూ దర్శనం కాదు, దక్కదు అని చక్కగా ఉపనిషత్తులు చెప్పాయి. ప్రాపంచిక విషయాలలో ఏ పనికైనా బద్దకించొచ్చు కానీ సాధన విషయంలో ఎప్పుడు బద్ధకం ఉండకూడదు. ఎప్పుడు నిరంతరము సాధన చేయడంలో హుషారు ఉండాలి. ఎందుకంటే **"డబ్బు విలువ మనిషికి తెలిసింది కానీ పరమాత్మ యొక్క శక్తి విలువ ఏ మనిషికీ తెలియదు".**

తెలిసున్నా చాలా కొద్దిగా అర్థమవుతుంది కానీ పూర్ణంగా అర్థం అవ్వట్లేదు. డబ్బు దాయొచ్చు, డబ్బుతో ప్రపంచంలో అన్నీ కొనుక్కోవచ్చు అనుకుంటున్నారు. కానీ ఆ డబ్బు కంటే విలువైన శక్తి ఆత్మ శక్తి అని ఎప్పుడైతే అర్థమవుతుందో ప్రతి మనిషి జీవితంలో బద్ధకం అనేదే ఉండదు. ఇప్పుడు ఒక పదిలక్షలు ఎవరైనా ఫ్రీగా ఇస్తానంటే అర్ధరాత్రి అయినా టకటకా లేచి వెళ్లి తెచ్చుకుంటారు. మరి అంతకంటే విలువైంది అన్నప్పుడు నిజంగా పక్క మీద నిద్రే పట్టదు.

అయ్యో నా జీవితం అయిపోతుందే, నేను సాధన చేయలేకపోతున్నానే అనే తపన ఉండాలి. అలా కాకుండా నువ్వు శరీరం మీద జాలి పడితే సాధన చేయలేవు. శరీరాన్ని కష్టపెట్టాలి, చాలా కష్టపెట్టాలి. అలా కష్టపెట్టినప్పుడే సాధన చేయగలుగుతారు. పడుకున్నప్పుడు నిద్ర గాఢంగా వస్తుంది అంటే ఆత్మ మీద దృష్టి తగ్గిపోయింది. మనో స్థితిలో ఉన్నప్పుడు ఒంట్లో బాలేదు, అలసిపోయాను, నిద్ర వస్తుంది అని అనుకుంటారు.

కానీ నేను భగవంతుడి మీద నుంచి దృష్టి మళ్ళించాను. మరి భగవంతుడి కృప నా మీద ఎలా ఉంటుంది? అని నిరంతరరం ఆలోచిస్తే బద్దకం వుండదు, సోమరిపోతులుగా వుండరు, అశ్రద్ధ చేయరు, ఇంకా ముందుకు వెళ్ళడానికి ప్రయత్నిస్తారు. గురువు అన్నీ చెప్తాడు కానీ చేయవలసింది శిష్యుడే. గురువులా ఎదగాలి అనే ఆదర్శం ఏ క్షణమైతే నీ

మనసులోకి వస్తుందో నిరంతర శ్రమజీవిగా మారిపోతారు.

మీరు మారినప్పుడే భగవంతుడికి కూడా మీ మీద కరుణ, కృప ఉంటుంది. ఎందుకంటే ఒక్క అడుగు నా వైపుకు వేస్తే 10 అడుగులు వచ్చి నీ చేయి అందుకుంటాను అని చెప్పాడు భగవంతుడు. ఒక్కడుగు వేయడమే మీ శ్రద్ధ, మీ తపన, మీ కృషి. అందుకే ఈ అంతరంగ సాధన చాలా జాగ్రత్తగా జరగాలి అంటే ఆలోచనలు ఎందుకు వస్తున్నాయి? అని విశ్లేషించుకుంటూ.. వీటన్నటికీ శక్తిని ఇచ్చేది ఆత్మే అని అనుక్షణము గ్రహించగలగాలి.

గ్రహించినప్పుడు ఇంకా ఇంకా ఆత్మ విలువ తెలుస్తుంది. చాలా శ్రద్ధగా చేస్తారు. అందుకే బహిర్ సాధన, అంతర్ సాధన రెండు ఎలా చేయాలి? అన్నది ఋషులు మనకి ఇవ్వడం జరిగింది. ఆచరణలో పెట్టుకోవలసింది సాధకులైన మీరే. ఎదగాలి అంటే ఆచరణ ఉంటుంది. గొప్ప పేరు రావాలి అంటే నోట్స్ రాసుకొని ప్రక్కవాడికి చెప్పేస్తూ వుంటారు. ఎంతవరకు ఒక సాధకుడికి విచారణా, విశ్లేషణా ఉండదో అంతవరకు పూర్ణంగా ఎదగలేరు.

గురువులు చెప్పారు, విన్నాము, నోట్స్ వ్రాసుకున్నాం, ఇంకో చోటికి వెళ్లి మనం క్లాస్ చెప్పేసాము, చప్పట్లు కొట్టారు అది కాదు కావాల్సింది. నీ అనుభవమే, నీ విచారణే, నీ జ్ఞానం. అందుకే వశిష్టుల వారు అన్నారు “విచారణే పరమజ్ఞానము” అని. గురువులు చెప్పింది ఆవగింజైతే, దాన్ని మహా వృక్షాన్ని చేసుకునేది నువ్వే. అది విచారణ వల్లే చేసుకోగలుగుతావు. ఆధ్యాత్మికతలో ప్రతి విషయాన్ని విచారణ చేయడమే మొదటి పునాది.

అందుకే ఎక్కువ విచారణ చేసి తెలుసుకోవాల్సిన విషయాలు తెలుసుకుంటూ ఉన్నప్పుడే బహిర్ సాధన, అంతర్ సాధన రెండు చాలా చక్కగా కుదురుతాయి. రెండు చక్కగా కుదిరినప్పుడే ఆత్మానుభూతిని పొందుతారు.

## తటవర్తి దంపతుల Website ద్వారా పొందే సమాచారము

website address : www.tst.org.in

a) తటవర్తి దంపతుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల వివరములు మరియు Google Maps Location తెలుసుకోవచ్చు.

b) తటవర్తి దంపతుల మొత్తం పుస్తకాలు PDF రూపంలో కలవు. వాటిని ఉచితంగా Download చేసుకోవచ్చు. ఈ పుస్తకాలు తెలుగు, కన్నడ, హిందీ మరియు ఇంగ్లీషు భాషలలో వున్నాయి.

c) తటవర్తి దంపతుల సందేశాలు Concept వారీగా YouTube Play lists రూపంలో ఇవ్వడం జరిగింది.

d) తటవర్తి దంపతుల సందేశాల సారాంశము కొటేషన్స్ రూపంలో ఇవ్వడం జరిగింది.

e) తటవర్తి దంపతుల ఫోటోలు కూడా చూడవచ్చు.

5. భీమవరంలో ప్రతి నెలా 1, 2, 3 తేదీలలో జరిగే ఉచిత ఆత్మజ్ఞాన శిక్షణా తరగతుల రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించవలసిన నెంబరు : **సింధూర, 8555995217**

## తటవర్తి దంపతుల YouTube ఛానెల్ Subscribe చేసుకోవాలంటే

a) Whatsapp group లో మీకు పంపబడుతున్న Youtube లింక్ మీద నొక్కినప్పుడు Tatavarthy Veera Raghava Rao ఛానెల్ open అవుతుంది. Open అవ్వగానే subscribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

లేకపోతే www.tst.org.in/videos/ ఓపెన్ అయిన తరువాత I లో Tatavarthy Veera Raghava Rao పేరు మీద నొక్కండి. II & III లో వున్న పేరు మీద నొక్కండి. ఛానెల్స్ Open అవుతాయి. Open అవ్వగానే subcribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

## తటవర్తి దంపతుల Zoom కార్యక్రమాలు చూడాలంటే?

a) ప్రతిరోజూ ఉదయం Zoom లో 4 to 6.30 a.m. Silence Meditation మరియు 6.30 to 7.30 a.m. వరకు **ఆత్మజ్ఞాన సందేశాలు**

Zoom I.D. :2413823868, Password : RAO

b) పై కార్యక్రమము 6.30 to 7.30 a.m. వరకు Youtubeలో కూడా Live ఇవ్వబడుతుంది.

c) ఎవరైతే TVR & TRL Whatsapp గ్రూపులో వుంటారో వారికి Zoom Link & You Tube Links మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా save చేసుకోవాలి.

d) తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే www.tst.org.in Open చేసిన తర్వాత Join in Whatsapp group లింక్ మీద నొక్కండి.

## YouTube ఛానెల్‌లో ప్రసారమయ్యే తటవర్తి దంపతుల కార్యక్రమాలు

a) Channel Name : Tatavarthy Veera Raghava Rao. ఇందులో 2500 పైగా వీడియోలలో తటవర్తి దంపతుల సందేశాలు ఇవ్వడం జరిగింది.

b) అలాగే PMC వారు కూడా బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు గారి యొక్క YouTube Channel ప్రారంభించారు. Channel Name : Brahmarshi Tatavarthy Veera Raghavarao


c) తటవర్తి దంపతుల దగ్గర ట్రైనింగ్ అయిన మాస్టర్ల సందేశాల కొరకు Tatavarty Spiritual Trainees ఛానెల్‌లో చూడండి.

d) Direct గా YouTube app లోకి వెళ్ళి search bar లో Tatavarthy Veera Raghava Rao అని టైపు చేస్తే తటవర్తి దంపతుల అన్ని వీడియోలు చూడవచ్చు.

# తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) సాధనలో స్థితులు | - | రూ.80/- |
| 3) జ్ఞానమాల | - | రూ.70/- |
| 4) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 5) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 6) జీవిత పరమార్థం | - | రూ.70/- |
| 7) గురుపౌర్ణమి విశిష్టత | - | రూ.60/- |
| 8) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 9) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 10)పంచకోశాలు | - | రూ.60/- |
| 11) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 12) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 13) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |

పుస్తకముల కొరకు : **తటవర్తి వీర రాఘవరావు**, తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర. సెల్:9440309812,



# Tatavarthy Raghavarao Sir Books in English

| | | |
|---|---|---|
| 1. | Life Science (Part-I) | Rs.120 |
| 2. | Why is Guiding Not Meditation ? | Rs.100 |
| 3. | Die before death! | Rs.120 |
| 4. | The Law of Karma | Rs.100 |
| 5. | What is Meditation? | Rs.80 |
| 6. | True Path | Rs.80 |
| 7. | Why soul-knowledge ? | Rs.70 |
| 8. | What comes after death ? | Rs.70 |
| 9. | How to improve Financial Status ? | Rs.60 |
| 10. | Wisdom is attained only through Meditation | Rs.60 |
| 11. | What is Intention? | Rs.50 |
| 12. | Why is this life? | Rs.50 |
| 13. | Vegetarian Food Is Human Food | Rs.50 |
| 14. | Meditation for the Development of Students | Rs.40 |
| 15. | Non violence and vegetarianism | Rs.40 |

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) సత్యమార్గం - రూ.160/-
5) ధ్యాన శక్తి - రూ.130/-
6) ధ్యాన శాస్త్రం - రూ.130/-
7) ఆత్మ శాస్త్రం - రూ.120/-
8) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం -రూ.160/-
9) మరణించకముందే మరణించాలి - రూ.130/-
10) జీవిత సూక్ష్మాలు - రూ.130/-
11) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
12) గీతాసందేశం - రూ.120/-
13) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/-
14) భగవంతుడంటే - రూ.100/-
15) తెలుసుకోండి - రూ.100/-
16) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/-
17) మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు- రూ.100/-
18) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం? - రూ.100/-
19) కర్మ సిద్ధాంతం - రూ.80/-
20) ధ్యానమంటే ? - రూ.80/-
21) త్రివిధాలు - రూ.80/-
22) ఉత్తమ పురుషుడు - రూ.80/-
23) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/-
24) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
25) జ్ఞాన జ్యోతి - రూ.70/-
26) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
27) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
28) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/-
29) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య- రూ.70/-
30) బుద్ధుని సందేశాలు - రూ.70/-
31) భూతదయే దైవత్వం - రూ.70/-
32) ఆత్మహంతకులంటే ఎవరు?- రూ.70/-
33) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి - రూ.70/-
34) ధర్మ సూక్ష్మాలు - రూ.70/-
35) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
36) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
37) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
38) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
39) అతీంద్రియ శక్తులు - రూ.60/-
40) ఆలోచించండి - రూ.60/-
41) నిర్వాణ మార్గం - రూ.60/-
42) ధ్యానులకు సూచనలు - రూ.60/-
43) యోగీశ్వరుల సందేశాలు - రూ.60/-
44) సంకల్పమంటే? - రూ.50/-
45) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
46) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
47) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే- రూ.40/-
48) ఛాంపియన్ అవ్వాలంటే? -రూ.40/-
49) బ్రహ్మం అంటే? -రూ.40/-
50) శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం -రూ.40/-
51) శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం -రూ.40/-
52) మహాత్ముల సందేశాలు - రూ.40/-
53) సత్యం - రూ.40/-
54) చక్రాలు - రూ.40/-
55) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
56) భాగవత సన్నివేశాల అంతరార్థం- రూ.40/-
57) మౌన ధ్యానం - రూ.40/-
58) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? -రూ.20/-
59) శాకాహారమే మానవాహారం - రూ.15/-
60) అహింస మరియు శాఖాహారం- రూ.15/-

పుస్తకముల కొరకు : **తటవర్తి వీర రాఘవరావు**, తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర. సెల్: 9440309812,



ఆధ్యాత్మికతలోకి వచ్చాకే మానవ జీవితం యొక్క పరమార్థం తెలుస్తుంది.ప్రాపంచిక జీవితంలో మానవ జన్మ యొక్క పరమార్థం తెలియదు. పూర్ణమైన ఆనందం పొందడమే ఈ జీవితం యొక్క పరమార్థం. ఈ పూర్ణమైన ఆనందాన్ని భగవంతుడి సృష్టిలో వెతికితే దొరకదు, ఆ ఆనందం భగవంతుని దగ్గరికి వెళితేనే దొరుకుతుంది.

కష్టాలు అనే సముద్రం ఎందుకు దాటాలంటే? ఈ దేహం ఉండగానే దేహాన్ని సృష్టించిన వాడిని తెలుసుకోవాలి అని ఒక చిన్న షరతు పెట్టి భగవంతుడు ఈ మానవ జన్మ ఇచ్చాడు. నువ్వు దుఃఖాలను దాటే మార్గం నా దగ్గరికి వచ్చే ప్రయత్నం చేయడమే అని భగవంతుడే నిర్ణయించాడు. నీకు గురువుని ఇస్తాను, అవకాశాలు ఇస్తాను, ఈ అవకాశాలను ఉపయోగించు కుంటూ నువ్వు ఆ గురువు చెప్పిన సాధన చేసి, గురువు ఏ సత్య మార్గాన్ని నీకు బోధించారో ఆ సత్య మార్గంలో పయనించగలగాలి అనే షరతు పెట్టాడు.

జ్ఞానం ద్వారా మీరెవరో మీరు తెలుసుకుంటూ పరమాత్మతో బంధాన్ని ధృఢపరుచుకోవాలి. పరమాత్మ అద్భుతమైన గురువుని, అద్భుతమైన అవకాశాల్ని ఇచ్చాడు. వాటిని ఉపయోగించుకుని సాధన చేస్తూ, జ్ఞానం పెంచుకుంటే! ఆ జ్ఞానమే మిమ్మల్ని ఉన్న స్థితి నుంచి, ఉన్నత స్థితికి తీసుకువెళ్తుంది. ఆయన సాంగత్యం పొందినప్పుడే ఆనందాన్ని పొందుతారు. ఇదే జీవిత పరమార్థం.

**- బ్రహ్మవిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి**

రూ.70/-